KANCHARLA

# మనసులో మాట

నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. | సంచలన తెలుగు దిన పత్రిక








ప్రచురణ : విశాఖపట్నం - పబ్లిషర్ : కంచర్ల ఉపేంద్ర - సంపుటి : 1 - సంచిక : 271 - సోమవారం - 1 జూన్ 2026 - ఎడిటర్ : కంచర్ల అచ్యుతరావు - పేజీలు : 8+16 - వెల రూ. 7/-

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, కడప, హైదరాబాద్


## మైనర్లను వ్యభిచారంలోకి దింపితే పోక్సో వర్తింపు




సుప్రీంకోర్టు కీలక తీర్పు..

4

## బ్రహ్మోస్‌కు డిమాండ్

- వియత్నాంతో కీలక ఒప్పందం
- ఇండోనేషియాతో తుది చర్చలు
- రక్షణ ఎగుమతుల్లో ముందడుగు




4

## సీడీఎస్‌గా రాజా సుబ్రమణి

- జాతీయ భద్రతే ప్రాధాన్యం
- సైనిక సంస్కరణలకు వేగం
- ఉమ్మడి సమన్వయంపై దృష్టి



వివరాలు 6వ పేజీలో

# రియల్ ఎస్టేట్‌కు 'డబుల్ ట్రబుల్'!



- అధిక వడ్డీ రేట్లు.. పెరిగిన ఇళ్ల ధరలతో కొనుగోలుదారులకు కష్టాలు
- ప్రపంచవ్యాప్తంగా మందగమన సంకేతాలు
- భారత్‌లో 4% తగ్గిన గృహ విక్రయాలు
- చైనాలో తీవ్ర సంక్షోభం.. అమెరికాలో కొనుగోలు శక్తి క్షీణత

### ఎక్కడ చూసినా అదే పరిస్థితి..

ప్రపంచ రియల్ ఎస్టేట్ రంగం తీవ్ర సంక్షోభ సంకేతాలు ఇస్తోంది. ఒకవైపు ఆకాశాన్నంటుతున్న ఇళ్ల ధరలు, మరోవైపు అధిక వడ్డీ రేట్లు కొనుగోలుదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. దీంతో ప్రపంచవ్యాప్తంగా గృహ విక్రయాలు మందగిస్తుండగా, నిర్మాణ రంగం కూడా ఒత్తిడిని ఎదుర్కొంటోంది. నిపుణులు దీనిని రియల్ ఎస్టేట్ రంగానికి 'డబుల్ ట్రబుల్'గా అభివర్ణిస్తున్నారు. కరోనా తర్వాత తక్కువ వడ్డీ రేట్లతో ఊపందుకున్న రియల్ ఎస్టేట్ రంగం ఇప్పుడు కేంద్ర బ్యాంకుల కఠిన వైఖరితో కుదేలవుతోంది. ఇళ్ల ధరలు తగ్గకపోవడం, రుణాలపై వడ్డీ భారం పెరగడం వల్ల మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కల మరింత దూరమవుతోంది.

..వివరాలు 2లో

- అమరావతి, మే 31 (మనసులో మాట ప్రత్యేక ప్రతినిధి)



## ఐపీఎల్ చాంపియన్ ఆర్సీబీ!

### ఫైనల్లో జీటీపై ఐదు వికెట్ల తేడాతో ఘన విజయం

చెలరేగిన కింగ్ కోహ్లీ..

- అజేయ అర్ధ శతకంతో అదుర్స్
- 18 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించిన బెంగళూరు
- బౌలింగ్ లో అదరగొట్టిన రసిఖ్ సలామ్, భువీ

ఐపీఎల్ ట్రోఫీ కోసం సుదీర్ఘ కాలంగా ఎదురుచూస్తున్న ఆర్సీబీ అభిమానుల కల ఎట్టకేలకు సాకారమైంది. అహ్మదాబాద్ లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్ పోరులో గుజరాత్ టైటాన్స్ పై (జీటీ) ఐదు వికెట్ల తేడాతో ఆర్సీబీ ఘన విజయం సాధించింది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అజేయ అర్ధ శతకంతో చెలరేగడంతో.. 156 పరుగుల లక్ష్యాన్ని ఆర్సీబీ కేవలం పద్దెనిమిది ఓవర్లలోనే ఐదు వికెట్లు కోల్పోయి ఛేదించింది. సమిష్టి కృషితో అదరగొట్టిన బెంగళూరు జట్టు సగర్వంగా ఐపీఎల్ చాంపియన్ గా అవతరించి చరిత్ర సృష్టించింది.

7

# ఏపీకి మరో 7 ఎయిర్‌పోర్టులు



ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా మరో 7 ఎయిర్‌పోర్టులు రాబోతున్నాయని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు కీలక ప్రకటన చేశారు. తెలుగుజాతి ఉన్నంతకాలం ఎన్టీఆర్ పేరు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువనేత లోకేశ్ నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పరుగులు తీస్తోందని తెలిపారు.

- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు కీలక ప్రకటన
- లాస్ ఏంజెల్స్‌లో ఘనంగా ఎన్టీఆర్ జయంతి, మినీ మహానాడు
- వర్చువల్‌గా హాజరైన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు
- జులైలో భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ను ప్రారంభించనున్నట్లు వెల్లడి
- ఏపీలో పెట్టుబడులకు ఎన్ఆర్ఐలకు వారధిగా ఉంటానన్న కోమటి జయరాం

3



## పెట్టుబడులే లక్ష్యంగా!

- రేపటి నుంచి రష్యాలో నారా లోకేష్ పర్యటన
- సెయింట్ పీటర్స్‌బర్గ్ అంతర్జాతీయ ఆర్థిక ఫోరంలో పాల్గొనాల్సిందిగా ఆహ్వానం
- పలువురు పారిశ్రామికవేత్తలతో భేటీ

2




### పెట్రో, గ్యాస్ ధరల పెంపుపై

## పోరుకు సిద్ధం

- 10 నుంచి సీపీఐ రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులు
- రైతు సంఘం ధర్నాలకు సంపూర్ణ సంఘీభావం
- జూన్ 1 నుంచి 7 వరకు వామపక్షాల ప్రచారం..
- 9న రాష్ట్రవ్యాప్త రాస్తారోకోలు : ఈశ్వరయ్య

3

## ఖరీఫ్‌కు ముందే గోదావరి జలాలు




- డెల్టా రైతులకు ఊరట..
- కాటన్ బ్యారేజ్ మరమ్మతులకు 148 కోట్లు
- మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి

ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే గోదావరి డెల్టా రైతులకు సాగునీటిని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఆదివారం ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ నుంచి సాగునీటిని విడుదల చేశారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఖరీఫ్‌కు ముందుగానే నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. తూర్పు డెల్టా కాలువ ద్వారా సుమారు 85 వేల ఎకరాలకు, నిడదవోలు, కొవ్వూరు కాలువల ద్వారా మరో 41 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని మంత్రి కందుల దుర్గేష్ చెప్పారు.

2

## భలే మాట!




**ప్రతినిధి:** రెండు తెలుగు రాష్ట్రాల అన్ని వార్తలన్ని ఒకే పేపర్‌లో దొరకడం అరుదు! ఒకసారి మా పేపర్చూ డండి సర్..

**పక్కనే ఉన్న అతను:** ఆయన ఎవరనుకున్నారు? మీరు గుర్తుపట్టలేదు.. ఈ పత్రిక అధినేత అచ్యుతరావు గారు!

మనసులో మాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక



# పెట్టుబడులే లక్ష్యంగా!

## రేపటి నుంచి రష్యాలో నారా లోకేష్ పర్యటన

## సెయింట్ పీటర్స్‌బర్గ్ అంతర్జాతీయ ఆర్థిక ఫోరంలో పాల్గొనాల్సిందిగా ఆహ్వానం

**అమరావతి, మే 31 (మనసులోమాట ప్రత్యేక ప్రతినిధి) :** రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ రష్యాలో పర్యటించనున్నారు. జూన్ 2 నుంచి 7వ తేదీ వరకు ఆయన రష్యాలో పర్యటించి, పలువురు పారిశ్రామికవేత్తలతో సమావేశం కానున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించి, వారిని ఏపీకి ఆహ్వానించడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం. రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో జరగనున్న ప్రతిష్ఠాత్మక 'సెయింట్ పీటర్స్‌బర్గ్ ఇంటర్నేషనల్ ఎకనామిక్ ఫోరమ్ - 2026' సదస్సులో పాల్గొనాల్సిందిగా మంత్రి లోకేష్‌కు ప్రత్యేక ఆహ్వానం అందింది. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల నుంచి పారిశ్రామికవేత్తలు, ఆర్థిక నిపుణులు ఈ సదస్సుకు హాజరవుతారు. ఈ పర్యటనలో భాగంగా, లోకేష్ పలువురు ప్రముఖ పారిశ్రామికవేత్తలు, కంపెనీల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ముఖ్యంగా ఐటీ, విద్య, ఇతర కీలక రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఆయన చర్చలు జరపనున్నారు. ఈ పర్యటన ద్వారా రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

# టిడ్కో ఇళ్లకు రూ.273.79 కోట్లు

## నిధులు విడుదల చేసిన ఏపీ సర్కారు

**అమరావతి, మే 31 (మనసులో మాట):** సొంతింటి కల కోసం ఎదురుచూస్తున్న వేలాది మంది టిడ్కో లబ్ధిదారులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న టిడ్కో గృహాల నిర్మాణ పనులను వేగవంతం చేయడంతో పాటు మౌలిక వసతుల అభివృద్ధి కోసం రూ.273.79 కోట్ల విడుదలకు ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో టిడ్కో గృహాల నిర్మాణం పూర్తికాకపోవడం, మరికొన్ని చోట్ల రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, తాగునీటి వంటి మౌలిక సదుపాయాల కొరత కారణంగా ఇళ్ల పంపిణీ ప్రక్రియ ఆలస్యమవుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం లబ్ధిదారుల్లో ఆశలు రేకెత్తిస్తోంది. విడుదల చేసిన నిధులతో పెండింగ్‌లో ఉన్న గృహాల నిర్మాణాన్ని పూర్తి చేయడంతో పాటు రహదారుల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి, విద్యుత్ కనెక్షన్లు, తాగునీటి సరఫరా వంటి కీలక పనులు చేపట్టనున్నారు. టిడ్కో హౌసింగ్ కాలనీల్లో సమగ్ర మౌలిక సదు-పాయాల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు అధికారులు తెలిపారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా వేలాది పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరే అవకాశం ఉందని అధికార వర్గాలు భావిస్తున్నాయి. ఎన్నాళ్లుగానో సొంత ఇంటి కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు ఇది ఊరటనిచ్చే పరిణామంగా మారనుంది. అలాగే నిర్మాణ పనులు, మౌలిక సదుపాయాల కల్పన పూర్తయితే టిడ్కో ఇళ్ల పంపిణీ ప్రక్రియ కూడా వేగం పుంజుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో త్వరలోనే అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల తాళాలు అందజేసే పరిస్థితులు ఏర్పడనున్నట్లు తెలుస్తోంది. సొంతింటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం మరో కీలక అడుగు వేసిందని అధికారులు పేర్కొంటున్నారు. అయితే విడుదల చేసిన నిధులతో పనులు ఎంత వేగంగా పూర్తవుతాయన్నదే ఇప్పుడు లబ్ధిదారుల ప్రధాన ఆసక్తిగా మారింది.

# పీఎం సేతు అమలులో ఆంధ్రప్రదేశ్ ఫస్ట్!


## విశాఖపట్నం ఐటీఐ క్లస్టర్ ప్రతిపాదనకు కేంద్రం ఆమోదం

**న్యూఢిల్లీ, మే 31 (మనసులోమాట ప్రత్యేక ప్రతినిధి) :** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రధాన మంత్రి స్కిల్లింగ్ అండ్ ఎంప్లాయబిలిటీ ట్రాన్స్‌ఫర్మేషన్ త్రూ అప్‌గ్రేడెడ్ ఐటీఐస్ (పీఎం-సేతు) పథకం అమలులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మొదటి రాష్ట్రంగా నిలిచింది. ఈ పథకం కింద విశాఖపట్నం ఐటీఐ క్లస్టర్‌కు సంబంధించిన వ్యూహాత్మక పెట్టుబడి ప్రణాళికకు కేంద్ర నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని జాతీయ స్టీరింగ్ కమిటీ ఆమోదముద్ర వేసింది. దేశవ్యాప్తంగా పీఎం-సేతు కింద ఆమోదం పొందిన తొలి ప్రాజెక్టు ఇదే కావడం విశేషం. ప్రముఖ ఉక్కు తయారీ సంస్థ ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా, న్యూ ఏజ్ మేకర్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నామ్‌టెక్)తో కలిసి ఈ ప్రాజెక్టును అమలు చేయనుంది. ఈ భాగస్వామ్యం ద్వారా విశాఖపట్నంలోని ప్రభుత్వ ఐటీఐలను 'హబ్ అండ్ స్పోక్' నమూనాలో ఆధునికీకరిస్తారు. పరిశ్రమల ప్రస్తుత, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సాంకేతిక శిక్షణ అందిస్తారు. 'వికసిత్ భారత్ 2047' లక్ష్యాల్లో భాగంగా, దేశవ్యాప్తంగా 1,000 ప్రభుత్వ ఐటీఐలను ఆధునీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం రూ. 60,000 కోట్ల బడ్జెట్‌తో ఈ పథకాన్ని ప్రారంభించింది. కోర్సు పూర్తయిన వెంటనే విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం. ఆంధ్రప్రదేశ్‌లో ఈ పథకం మొదటగా ప్రారంభం కానుండటంతో, ఇది ఇతర రాష్ట్రాలకు ఒక నమూనాగా నిలుస్తుందని అధికారులు భావిస్తున్నారు.



# రియల్ ఎస్టేట్‌కు 'డబుల్ ట్రబుల్'!

- ఎక్కడ చూసినా అదే పరిస్థితి..
- అధిక వడ్డీ రేట్లు.. పెరిగిన ఇళ్ల ధరలతో కొనుగోలుదారులకు కష్టాలు
- ప్రపంచవ్యాప్తంగా మందగమన సంకేతాలు
- భారత్‌లో 4% తగ్గిన గృహ విక్రయాలు
- చైనాలో తీవ్ర సంక్షోభం.. అమెరికాలో కొనుగోలు శక్తి క్షీణత



**అమరావతి, మే 31 (మనసులో మాట ప్రత్యేక ప్రతినిధి):** ప్రపంచ రియల్ ఎస్టేట్ రంగం ప్రస్తుతం ద్వంద్వ ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ఒకవైపు ఇళ్ల ధరలు సామాన్యుడి అందుబాటుకు దూరమవుతుండగా, మరోవైపు అధిక వడ్డీ రేట్లు గృహ రుణాల భారం పెంచుతున్నాయి. కరోనా అనంతరం చౌక వడ్డీ రేట్లతో వేగంగా పుంజుకున్న ఈ రంగం ఇప్పుడు కేంద్ర బ్యాంకుల కఠిన ద్రవ్య విధానాల ప్రభావంతో మందగమనంలోకి జారుతున్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో గృహ ధరలు గరిష్ఠ స్థాయిల నుంచి కొంత తగ్గినా, ప్రజల ఆదాయాలతో పోలిస్తే ఇంకా అధికంగానే ఉన్నాయి. హాంగ్‌కాంగ్‌లో సగటు అపార్ట్‌మెంట్ కొనుగోలు చేయాలంటే దాదాపు 14 ఏళ్ల ఆదాయం అవసరమవుతుండగా, లండన్‌లో 12 ఏళ్ల ఆదాయం అవసరమవుతోంది. దీంతో మధ్యతరగతి కుటుంబాలకు సొంత ఇల్లు కలగానే మిగిలిపోతోందని ఆర్థిక విశ్లేషకులు చెబుతున్నారు. చైనాలో రియల్ ఎస్టేట్ సంక్షోభం మరింత తీవ్రమైంది. ప్రభుత్వ నియంత్రణ చర్యలతో పాటు భారీ రుణభారం కారణంగా ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలు కుప్పకూలాయి. ముఖ్యంగా కుటుంబాల సంపదలో అధిక భాగం గృహాల రూపంలో ఉండటంతో, అక్కడి ఆర్థిక వ్యవస్థపై దీర్ఘకాలిక ప్రభావం పడుతున్నట్లు నిపుణులు హెచ్చరిస్తున్నారు. అమెరికాలో కూడా పరిస్థితి అంత ఆశాజనకంగా లేదు. ద్రవ్యోల్బణ ప్రభావంతో ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోయింది. 2019తో పోలిస్తే ప్రస్తుతం గృహాలను కొనుగోలు చేయగల కుటుంబాల సంఖ్య గణనీయంగా తగ్గిందని నివేదికలు సూచిస్తున్నాయి. భారతదేశంలోనూ రియల్ ఎస్టేట్ రంగంలో మందగమన సంకేతాలు కనిపిస్తున్నాయి. తాజా పరిశ్రమ నివేదికల ప్రకారం 2026 తొలి త్రైమాసికంలో గృహ విక్రయాలు 4 శాతం తగ్గాయి. ముఖ్యంగా రూ.1 కోటి లోపు ధర కలిగిన ఇళ్ల విభాగంలో అమ్మకాలు మందగించగా, లగ్జరీ హౌసింగ్ మార్కెట్ మాత్రం కొంత స్థిరంగా కొనసాగుతోంది. దేశవ్యాప్తంగా అమ్ముడుపోని ఇళ్ల నిల్వలు కూడా పెరుగుతున్నాయి. ఈ నిల్వలను పూర్తిగా విక్రయించేందుకు సుమారు ఆరు త్రైమాసికాల సమయం పట్టే పరిస్థితి ఉందని మార్కెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇది డెవలపర్లపై అదనపు ఒత్తిడిని పెంచుతోంది. ఇక గృహ రుణ వడ్డీ రేట్లు కొంత మేర తగ్గినప్పటికీ, అంతర్జాతీయ ఉద్రిక్తతల కారణంగా పెరిగిన ఇంధన, రవాణా ఖర్చులు ఆ ప్రయోజనాన్ని దెబ్బతీస్తున్నాయి. దీంతో గృహ రుణాల భారం తగ్గకపోవడంతో పాటు నిర్మాణ వ్యయాలు కూడా పెరుగుతున్నాయి. ఆర్థిక నిపుణుల అభిప్రాయం ప్రకారం, వడ్డీ రేట్లు మరింత తగ్గితేనే రియల్ ఎస్టేట్ రంగానికి ఊరట లభించే అవకాశం ఉంది. అయితే అంతర్జాతీయ భౌగోళిక-రాజకీయ పరిస్థితులు, ఇంధన ధరల అస్థిరత కారణంగా సమీప భవిష్యత్తులో పెద్ద మార్పులు కనిపించే అవకాశాలు తక్కువగా ఉన్నాయని వారు విశ్లేషిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వృద్ధికి కీలక రంగంగా భావించే రియల్ ఎస్టేట్ ప్రస్తుతం 'అధిక ధరలు -- అధిక వడ్డీ రేట్లు' అనే డబుల్ ట్రబుల్‌ను ఎదుర్కొంటుండగా, దీని ప్రభావం కొనుగోలుదారులు, నిర్మాణ సంస్థలు, బ్యాంకింగ్ రంగంపై కూడా స్పష్టంగా కనిపిస్తోంది.

# ఏపీకి మరో 7 ఎయిర్‌పోర్టులు

- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు కీలక ప్రకటన
- లాస్ ఏంజెల్స్‌లో ఘనంగా ఎన్టీఆర్ జయంతి, మినీ మహానాడు
- వర్చువల్‌గా హాజరైన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు
- జులైలో భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ను ప్రారంభించనున్నట్లు వెల్లడి
- ఏపీలో పెట్టుబడులకు ఎన్ఆర్ఐలకు వారధిగా ఉంటానన్న కోమటి జయరాం




**అమరావతి, మే 31 (మనసులోమాట ప్రత్యేక ప్రతినిధి) :** లాస్ ఏంజెల్స్‌లో ఎన్టీఆర్ జయంతి, మినీ మహానాడు వేడుకలు ఎన్నారై టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఢిల్లీ నుంచి వర్చువల్‌గా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా మరో 7 ఎయిర్‌పోర్టులు రాబోతున్నాయని కీలక ప్రకటన చేశారు. తెలుగుజాతి ఉన్నంతకాలం ఎన్టీఆర్ పేరు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని ఆయన అన్నారు. ఆరెంజ్ సిటీలోని తందూరి రెస్టారెంట్‌లో జరిగిన ఈ వేడుకకు 150 మందికి పైగా టీడీపీ కార్యకర్తలు, అభిమానులు, ప్రవాస తెలుగు ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువనేత లోకేశ్ నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పరుగులు తీస్తోందని తెలిపారు. గూగుల్, ఆర్సెలర్ మిట్టల్ వంటి దిగ్గజ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయని వివరించారు. ఉత్తరాంధ్ర ముఖచిత్రాన్ని మార్చే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని జులైలో ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. విజయవాడ నుంచి సింగపూర్‌కు ఇప్పటికే నేరుగా విమాన సర్వీసులు ప్రారంభించామని, త్వరలోనే మలేషియా, హాంగ్ కాంగ్, గల్ఫ్ దేశాలకు కూడా సర్వీసులు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో కూటమి విజయంలో ఎన్ఆర్ఐల పాత్ర మరువలేనిదని కొనియాడారు. ఉత్తర అమెరికా ప్రత్యేక ప్రతినిధి కోమటి జయరాం మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి ప్రవాసాంధ్రుల సహకారం ఎంతో అవసరమని, ఏపీలో పెట్టుబడులు పెట్టే ఎన్ఆర్ఐలకు తాను వారధిగా ఉంటానని హామీ ఇచ్చారు. టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభి రామ్, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ఎన్ఆర్ఐలు తమ సహకారం అందించాలని కోరారు. లాస్ ఏంజిల్స్ ఎన్నారై టీడీపీ నాయకులు అట్లూరి శ్రీహరి, హేమకుమార్ గొట్టి, శ్రీధర్ సాతులూరి, వంశీ గరికపాటి, విష్ణు యలమంచి తదితరుల నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా ఎన్టీఆర్‌ను స్మరించుకుంటూ కేక్ కట్ చేసి, ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. మహానాడు తీర్మానాలు, రాష్ట్ర అభివృద్ధిలో ప్రవాస భారతీయుల పాత్రపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పలువురు కీలక నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ఖరీఫ్‌కు ముందే గోదావరి జలాలు విడుదల

## డెల్టా రైతులకు ఊరట.. కాటన్ బ్యారేజ్ మరమ్మతులకు రూ.148 కోట్లు

## మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి





**రాజమహేంద్రవరం, మే 31 (మనసులో మాట ప్రత్యేక ప్రతినిధి):** ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే గోదావరి డెల్టా రైతులకు సాగునీటిని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఆదివారం ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ నుంచి సాగునీటిని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, రాజ్యసభ సభ్యుడు సతీష్, కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మధుర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఖరీఫ్‌కు ముందుగానే నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. తూర్పు డెల్టా కాలువ ద్వారా సుమారు 85 వేల ఎకరాలకు, నిడదవోలు, కొవ్వూరు కాలువల ద్వారా మరో 41 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. వాతావరణ నిపుణులు ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను సూచిస్తున్న నేపథ్యంలో రైతులు ముందుగానే నాట్లు వేసుకుని పంటలను రక్షించుకోవాలని మంత్రి సూచించారు. ముందస్తు నీటి విడుదల వల్ల పంట త్వరగా చేతికొచ్చి రైతులకు లాభం చేకూరుతుందన్నారు. గత ప్రభుత్వం గోదావరి డెల్టాను నిర్లక్ష్యం చేసిందని ఆరోపించిన మంత్రి, సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ గేట్ల మరమ్మతుల కోసం ప్రస్తుత ప్రభుత్వం రూ.148 కోట్లు మంజూరు చేసిందని వెల్లడించారు. కాలువల మరమ్మతుల కోసం మరో రూ.13 కోట్లు విడుదల చేసి, సాగునీటి సంఘాల ద్వారా 80 శాతం పనులు పూర్తిచేసినట్లు తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసి, 24 గంటల్లోనే వారి ఖాతాల్లో నేరుగా నగదు జమ చేస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో రైతులు చెల్లింపుల కోసం నెలల తరబడి వేచి చూడాల్సి వచ్చేదని విమర్శించారు. కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నీటి విడుదలతో కాకినాడ జిల్లా పరిధిలో 1,37,838 ఎకరాలకు సాగునీరు అందుబాటులోకి రానుందని తెలిపారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ మాట్లాడుతూ ధవళేశ్వరం బ్యారేజ్‌లో 117 గేట్లను కొత్తవిగా ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సుమారు రూ.150 కోట్లు కేటాయించిందన్నారు. గోదావరి ఈస్టర్న్ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ మురలశెట్టి సునిల్ కుమార్ మాట్లాడుతూ ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి ఈస్టర్న్ డెల్టాకు 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. రైతుల అవసరాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు నీటి సరఫరా కొనసాగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ప్రజాప్రతినిధులు, సాగునీటి సంఘాల ప్రతినిధులు, ఇరిగేషన్ శాఖ అధికారులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పెట్రో, గ్యాస్ ధరల పెంపుపై పోరుకు సిద్ధం

- జూన్ 10 నుంచి 15 వరకు సీపీఐ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు
- రైతు సంఘం ధర్నాలకు సంపూర్ణ సంఘీభావం
- జూన్ 1 నుంచి 7 వరకు వామపక్షాల ప్రచారం..
- 9న రాష్ట్రవ్యాప్త రాస్తారోకోలు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య వెల్లడి



**విజయవాడ, మే 31 (మనసులో మాట):** భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో జూన్ 10 నుంచి 15 వరకు ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులోని స్నేహ గార్డెన్‌లో రాష్ట్రస్థాయి రాజకీయ, సైద్ధాంతిక శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా హాజరవుతారని వెల్లడించారు. విజయవాడ దాసరి భవన్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 28 జిల్లాల నుంచి పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర సమితి సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొంటారని చెప్పారు. దేశ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, ఆర్థిక-సామాజిక అంశాలు, ప్రజా ఉద్యమాలపై విస్తృత చర్చలు జరగనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో జూన్ 1న చేపట్టనున్న ధర్నాలకు సీపీఐ సంపూర్ణ సంఘీభావం ప్రకటిస్తున్నట్లు ఈశ్వరయ్య వెల్లడించారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. మొక్కజొన్న, వర్జీనియా పొగాకు, దానిమ్మ, బత్తాయి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ జూన్ 1 నుంచి 7 వరకు రాష్ట్రవ్యాప్తంగా పది వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జూన్ 9న రాష్ట్రవ్యాప్తంగా రాస్తారోకోలకు పిలుపునిచ్చినట్లు వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివృద్ధి పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. మోదీ పాలనలో దేశ అప్పులు భారీగా పెరిగాయని, నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతుల ఆత్మహత్యలు ఆందోళనకర స్థాయికి చేరాయని విమర్శించారు. పెట్రోల్, డీజిల్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధిస్తున్న పన్నులను తగ్గిస్తే ధరలు గణనీయంగా తగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు. గ్యాస్ ధరల పెరుగుదలతో చిరు వ్యాపారులు, సామాన్య ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కేజీ బేసిన్‌లో ఉత్పత్తి అవుతున్న చమురు, సహజవాయువులో ఆంధ్రప్రదేశ్‌కు 50 శాతం వాటా కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఆర్టీసీని ప్రైవేటీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, సంస్థకు చెందిన విలువైన ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయాల్సింది పోయి బలహీనపరిచే విధానాలు అమలు చేస్తున్నారని మండిపడ్డారు. జూన్ 1 నుంచి 7 వరకు నిర్వహించే ప్రచార కార్యక్రమాలు, జూన్ 9న జరిగే రాస్తారోకోలను ప్రజలు విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి. దుర్గాభవాని, దోనేపూడి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో భూ కుంభకోణం.. ఏపీ ప్రతిష్ఠకు మచ్చ

- బొల్లా బ్రహ్మనాయుడిని రాజకీయాల నుంచి బహిష్కరించాలి
- జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు
- రూ.1,500 కోట్ల ప్రభుత్వ భూమి కబ్జా యత్నంపై తీవ్ర విమర్శలు
- వైసీపీ నేతలు స్పష్టమైన వైఖరి ప్రకటించాలని డిమాండ్




**వినుకొండ, మే 31 (మనసులో మాట):** తెలంగాణలో వెలుగులోకి వచ్చిన భారీ భూ కుంభకోణం ఆంధ్రప్రదేశ్‌కు చెడ్డపేరు తీసుకొచ్చిందని జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు విమర్శించారు. వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, బొల్లా రమేష్‌లు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న భూ అక్రమాలపై తీవ్రంగా స్పందిస్తూ, బొల్లా బ్రహ్మనాయుడిని రాజకీయాల నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. వినుకొండలోని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మక్కెన మాట్లాడారు. హైదరాబాద్ గండిపేట పరిధిలోని సర్వే నెం.18లో ఉన్న ప్రభుత్వ భూమిని తెలంగాణ హైకోర్టు ఇప్పటికే ప్రభుత్వ భూమిగా గుర్తించినప్పటికీ, దానిని నకిలీ జీవోలు, ఫోర్జరీ పత్రాల ఆధారంగా స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ భూమి మార్కెట్ విలువ దాదాపు రూ.1,500 కోట్ల వరకు ఉంటుందని, అయితే కేవలం రూ.35 కోట్లకే కబ్జా చేసేందుకు కుట్ర జరిగిందని పేర్కొన్నారు. నకిలీ జీవోలను స్థానిక తహసీల్దార్ గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతోనే కేసు నమోదైందని తెలిపారు. ఈ వ్యవహారానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి నారా లోకేష్ లేదా ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులుతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. భూ కుంభకోణాన్ని రాజకీయ కోణంలో మళ్లించే ప్రయత్నాలు సరికావన్నారు. వినుకొండ నియోజకవర్గంలో కూడా బొల్లా బ్రహ్మనాయుడు పలు భూ వివాదాల్లో ఆరోపణలు ఎదుర్కొన్నారని మక్కెన అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తక్కువ విలువ ఉన్న భూములను అధిక ధరలకు ప్రభుత్వానికి విక్రయించి కోట్ల రూపాయలు పొందారని ఆరోపించారు. అలాగే భూ ఆక్రమణల కారణంగా పలువురు బాధితులు తీవ్ర నష్టాలు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. ఈ కేసులో ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయని, దర్యాప్తు సంస్థలు పూర్తిస్థాయిలో విచారణ జరపాలని కోరారు. భూ కబ్జాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సహా పార్టీ నాయకులు ఈ వ్యవహారంపై తమ వైఖరిని స్పష్టంగా ప్రకటించాలని మక్కెన కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు మచ్చతెచ్చే చర్యలను ఖండించడం ప్రతి రాజకీయ పార్టీ బాధ్యత అని అన్నారు. ఈ సమావేశంలో వినుకొండ మార్కెట్ యార్డ్ చైర్మన్ మీసాల మురళీకృష్ణ యాదవ్, పార్లమెంట్ స్పోక్స్‌పర్సన్ పల్లమీసాల దాసయ్య, వినుకొండ పట్టణ తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు బొంకూరి రోశయ్య, సీనియర్ నాయకుడు బి. అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హింసాత్మక ఘటనలను సహించం

- అక్రమ మైనింగ్, అసత్య ప్రచారాలపై అప్రమత్తంగా ఉండాలి
- రాజకీయ ప్రయోజనాల కోసం వ్యక్తిగత దాడులు తగవు
- సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలి
- దాడి ఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు మంత్రి ఆదేశం
- రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి



**విజయవాడ, మే 31 (మనసులోమాట ప్రత్యేక ప్రతినిధి) :** ఆగిరిపల్లి మండలం శోభనాపురం గ్రామానికి చెందిన నక్కనబోయిన సాంబశివరావు యాదవ్‌పై ఇటీవల జరిగిన దాడి ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఈ ఘటన గురించి సమాచారం అందిన వెంటనే సంబంధిత పోలీసు అధికారులను అప్రమత్తం చేసి, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు మంత్రి పేర్కొన్నారు. ఇటువంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు శాఖకు సూచించినట్లు వెల్లడించారు. సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్న మంత్రి. రాజకీయ నాయకులు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించి ఎలాంటి హింసాత్మక చర్యలను ప్రోత్సహించరాదన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో విభేదాలు చర్చలు, చట్టబద్ధ మార్గాల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. సోషల్ మీడియా ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడానికి, వాస్తవాలను ప్రజలకు చేరవేయడానికి ఉపయోగపడాలని, వ్యక్తిగత దూషణలు, అసత్య ప్రచారాలు, అభండాలు వేయడానికి దానిని వినియోగించడం సమాజానికి హానికరమని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల నిర్మాణంలో గ్రేవల్‌తో పాటు ఇతర ఖనిజ వనరులు కీలకమని, మైనింగ్ కార్యకలాపాలు పూర్తిగా చట్టబద్ధంగా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా జరగాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. అక్రమ మైనింగ్‌ను అరికట్టడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పక్కనపెట్టి ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రయత్నాలు చేయడం బాధాకరమని పేర్కొన్న మంత్రి. అధికారులను, వ్యాపార వర్గాలను భయభ్రాంతులకు గురిచేసే చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం వ్యక్తిగత దాడులు చేయడం, శాంతిభద్రతలకు భంగం కలిగించడం సమంజసం కాదని స్పష్టం చేసిన మంత్రి కొలుసు పార్థసారథి, సమాజ శ్రేయస్సు కోసం అందరూ సంయమనం పాటిస్తూ చట్టాన్ని గౌరవించాలని, బాధ్యతాయుతమైన పౌరులుగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. వేరే వార్డుల్లోని పేషెంట్స్ అభ్యర్థన మేరకు వారిని కూడా మంత్రి పార్థసారథి పరామర్శించారు.



## హోంగార్డుపై దాడి దురదృష్టకరం

### హోం మంత్రి అనిత

**విశాఖపట్నం, మే 31:** విధి నిర్వహణలో ఉన్న హోంగార్డు వెంకటరమణపై కత్తితో దాడి జరగడం అత్యంత దురదృష్టకరమని రాష్ట్ర హోం మంత్రి అనిత పేర్కొన్నారు. లంకెలపాలెం వద్ద విధులు నిర్వర్తిస్తున్న సమయంలో దుండగుల దాడికి గురై గాయపడిన హోంగార్డు వెంకటరమణ ప్రస్తుతం షీలా నగర్ కిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు. ఆదివారం ఆసుపత్రికి వెళ్లిన హోం మంత్రి అనిత, వెంకటరమణను పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. చికిత్సకు సంబంధించిన వివరాలను తెలుసుకోవడంతో పాటు కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం తరపున అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న హోంగార్డు వెంకటరమణపై కత్తితో దాడి చేయడం తీవ్రంగా ఖండించదగిన చర్య అని అన్నారు. ఈ ఘటనలో ఆయనకు తీవ్ర గాయాలు అయినప్పటికీ, పోలీసులు వెంటనే స్పందించి ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారని తెలిపారు. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో వెంకటరమణ చికిత్స పొందుతున్నారని చెప్పారు. ఘటనకు పాల్పడిన నిందితులను ఇప్పటికే పోలీసులు అరెస్టు చేశారని, వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వెల్లడించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసు శాఖ మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తుందని, అవసరమైన పటిష్ట చర్యలు చేపడతామని పేర్కొన్నారు. పోలీసులు ప్రజల భద్రత కోసం అనునిత్యం కష్టపడి విధులు నిర్వహిస్తున్నారని, వారి విధుల నిర్వహణకు ప్రజలు కూడా సహకరించాలని హోం మంత్రి విజ్ఞప్తి చేశారు. చట్టాన్ని గౌరవించడం ప్రతి పౌరుడి బాధ్యత అని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, విధి నిర్వహణలో ఉన్న సిబ్బందిపై దాడులకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదని స్పష్టం చేశారు.

## వైఎస్ విగ్రహం పునరుద్ధరించాలి: షర్మిల

### నంద్యాల ఘటనపై ఆగ్రహం.. ఆమరణ దీక్ష హెచ్చరిక



**నంద్యాల, మే 31 :** నంద్యాల జిల్లాలో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహం ధ్వంసం ఘటనపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనను కాంగ్రెస్ పార్టీ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రకటించిన ఆమె, విగ్రహాన్ని వెంటనే పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నంద్యాలలో ఆమరణ దీక్ష చేపడతానని హెచ్చరించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ నంద్యాలలోని శ్రీనివాస సెంటర్‌లో ఉన్న వైఎస్ఆర్ విగ్రహంపై ఓ వ్యక్తి దాడి చేసి ధ్వంసం చేశాడని పేర్కొన్నారు. పట్టపగలు ఈ ఘటన జరుగుతున్నప్పటికీ అక్కడే ఉన్న పోలీసులు దానిని అడ్డుకోలేకపోవడం అత్యంత బాధాకరమని విమర్శించారు. చట్టాన్ని అమలు చేయాల్సిన యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపించారు. దాడికి పాల్పడిన వ్యక్తికి మానసిక పరిస్థితి సరిగా లేదని చెప్పడం ద్వారా పోలీసులు బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని షర్మిల వ్యాఖ్యానించారు. అసలు ఘటన వెనుక ఉన్న కారణాలు, దానికి ప్రేరేపించిన వ్యక్తులు లేదా శక్తులు ఎవరో వెలుగులోకి తేవాలని డిమాండ్ చేశారు. ఈ కేసులో సమగ్ర దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న ఇటువంటి ఘటనలను ప్రభుత్వం కఠినంగా అరికట్టాలని షర్మిల కోరారు. ప్రజాదరణ పొందిన నాయకుల విగ్రహాలపై దాడులు జరగడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలు రాజకీయ విద్వేషాలను పెంచే ప్రమాదం ఉందని అభిప్రాయపడ్డారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తితో పాటు అతని వెనుక ఉన్న వారిని కూడా గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో వెంటనే స్పందించి ప్రజలలో నెలకొన్న ఆందోళనను తొలగించాలని కోరారు. విగ్రహాల ధ్వంసం వంటి ఘటనలపై రాజీ లేని వైఖరి అవలంబించాలని సూచించారు. ధ్వంసమైన విగ్రహం స్థానంలో వెంటనే కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని షర్మిల డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ విషయంలో చర్యలు తీసుకోకపోతే నంద్యాలలోని అదే శ్రీనివాస సెంటర్ వద్ద ఆమరణ దీక్ష చేపడతానని హెచ్చరించారు. ప్రజల మనోభావాలను గౌరవిస్తూ ప్రభుత్వం వెంటనే స్పందించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## కృష్ణకు చంద్రబాబు నివాళి

**అమరావతి, మే 31 :** తెలుగు సినీ పరిశ్రమలో తనదైన ముద్ర వేసిన పద్మభూషణ్ ఘట్టమనేని కృష్ణ జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆయనకు ఘన నివాళులర్పించారు. తెలుగు చిత్రసీమ అభివృద్ధికి కృష్ణ అందించిన విశిష్ట సేవలను స్మరించుకుంటూ ఆయనను గొప్ప నటుడు, దర్శకుడు, సాహసోపేత నిర్మాతగా కొనియాడారు. జయంతి సందర్భంగా తన అధికారిక సామాజిక మాధ్యమ వేదిక ద్వారా స్పందించిన ముఖ్యమంత్రి, తెలుగు సినిమాకు నూతన సాంకేతికతలను పరిచయం చేయడంలో ఘట్టమనేని కృష్ణ ముందంజలో ఉన్నారని పేర్కొన్నారు. ఆయన కృషి వల్లే తెలుగు సినిమా కొత్త దిశగా అడుగులు వేసిందని అభిప్రాయపడ్డారు. సినీ రంగ అభివృద్ధి కోసం కృష్ణ చేసిన కృషి చిరస్మరణీయమని చంద్రబాబు తెలిపారు. నటుడిగా మాత్రమే కాకుండా దర్శకుడిగా, నిర్మాతగా కూడా ఎన్నో ప్రయోగాలు చేసి తెలుగు చిత్ర పరిశ్రమకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చారని అన్నారు. కొత్త సాంకేతికతలు, వినూత్న ఆలోచనలను తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేయడంలో కృష్ణ కీలక పాత్ర పోషించారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తెలుగు చిత్ర పరిశ్రమకు అందించిన విశేష సేవలకు గాను ఆయనకు ఘనంగా నివాళులు అర్పిస్తూ అభిమానులు, సినీ ప్రముఖులు జ్ఞాపకాలను పంచుకుంటున్నారు.




# ఉపరాష్ట్రపతి చేతులమీదుగా మాతృశ్రీ పార్కు ప్రారంభం

## గ్రామీణాభివృద్ధికి కొత్త ఊతం

## మహిళా సాధికారతకు ప్రోత్సాహం

**బెళ్తంగడి, మే 31:** కర్ణాటకలోని బెళ్తంగడిలో ఏర్పాటు చేసిన సిరి మాతృశ్రీ పారిశ్రామిక పార్కును భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, మహిళల ఆర్థిక సాధికారతకు ఈ పార్కు కీలకంగా మారుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ గ్రామీణ భారతదేశాన్ని సుసంపన్నంగా తీర్చిదిద్దే కలను సాకారం చేయడంలో సిరి వంటి సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. ఉపాధి అవకాశాల కల్పన, స్వయం ఉపాధి ప్రోత్సాహం ద్వారా వేలాది మహిళలు, గ్రామీణ కుటుంబాల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకువచ్చాయని పేర్కొన్నారు. మహిళల సాధికారత దేశ అభివృద్ధికి బలమైన పునాది అని ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు ఉపాధి అవకాశాలు పెరగడం ద్వారా కుటుంబాల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడటమే కాకుండా సమాజ అభివృద్ధికి కూడా దోహదపడుతుందని వివరించారు. పారిశ్రామిక పార్కులు గ్రామీణ ప్రాంతాల్లో పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాయని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్, రాజ్యసభ సభ్యుడు, సిరి సంస్థ అధ్యక్షుడు డాక్టర్ డి. వీరేంద్ర హెగ్గడే, లోక్‌సభ సభ్యుడు బృజేష్ చౌటా, సిరి సంస్థ వ్యవస్థాపకురాలు హేమావతి వి. హెగ్గడే పాల్గొన్నారు. ప్రముఖులు పార్కు ఏర్పాటును అభినందించారు. గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, స్వయం ఉపాధి అవకాశాల విస్తరణ లక్ష్యాలతో సిరి సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని సభలో పలువురు అభిప్రాయపడ్డారు. ఈ పారిశ్రామిక పార్కు ద్వారా స్థానిక ప్రజలకు మరిన్ని ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందని తెలిపారు.

# మైనర్లను వ్యభిచారంలోకి దింపితే పోక్సో వర్తింపు

## సుప్రీంకోర్టు కీలక తీర్పు.. అక్రమ రవాణాపై కఠిన హెచ్చరిక



**న్యూఢిల్లీ, మే 31:** మైనర్ బాలికలను వ్యభిచారంలోకి దింపేందుకు లేదా లైంగిక దోపిడీ కోసం ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించినా పోక్సో చట్టం వర్తిస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. లైంగిక దాడి జరిగిన తర్వాత మాత్రమే పోక్సో అమలవుతుందనే అభిప్రాయం సరైంది కాదని అత్యున్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. మైనర్ల అక్రమ రవాణాకు సంబంధించిన ఓ కేసులో కర్ణాటక హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం ఈ కీలక తీర్పు వెలువరించింది. వ్యభిచారం లేదా కమర్షియల్ సెక్స్ కోసం మైనర్ బాలికలను తరలిస్తున్నట్లు ప్రాథమిక ఆధారాలు ఉన్నప్పుడు పోక్సో చట్టంలోని నిబంధనలను వర్తింపజేయడం పూర్తిగా చట్టబద్ధమేనని ధర్మాసనం పేర్కొంది. మైనర్లను లైంగిక దోపిడీ నుంచి రక్షించడమే పోక్సో చట్టం ప్రధాన ఉద్దేశమని, అందువల్ల నేరం పూర్తిగా జరిగే వరకు వేచి చూడాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఇంతకుముందు కర్ణాటక హైకోర్టు, మైనర్ బాలికలను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించడం మాత్రమే జరిగితే అది భారతీయ శిక్షాస్మృతి (ఐపీసీ), అనైతిక రవాణా నిరోధక చట్టం పరిధిలోకి వస్తుందని, లైంగిక దాడి జరిగిన తర్వాతే పోక్సో వర్తిస్తుందని పేర్కొంది. అయితే ఆ అభిప్రాయాన్ని సుప్రీంకోర్టు తప్పుబట్టింది. మైనర్లను వ్యభిచారంలోకి నెట్టే ప్రయత్నాలు అత్యంత ఘోరమైన నేరాలని, అలాంటి కార్యకలాపాలను ప్రారంభ దశలోనే అరికట్టేందుకు పోక్సో చట్టాన్ని సమర్థవంతంగా ఉపయోగించాలని ధర్మాసనం సూచించింది. మైనర్ల అక్రమ రవాణా, లైంగిక దోపిడీ కేసుల్లో ఈ తీర్పు కీలక మార్గదర్శకంగా నిలవనుందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సుప్రీంకోర్టు తాజా తీర్పుతో మైనర్లను వ్యభిచారంలోకి దింపే ముఠాలపై మరింత కఠిన చర్యలకు మార్గం సుగమం కానుంది.

# పెళ్లి మాటతో 14.8 లక్షల మోసం

## మ్యాట్రిమోనియల్ పరిచయం పేరుతో మహిళకు టోకరా

**నాగపూర్ :** మహారాష్ట్రలోని నాగపూర్‌లో ఓ 31 ఏళ్ల మహిళను పెళ్లి చేసుకుంటానని నమ్మించి రూ.14.8 లక్షలు కాజేసిన ఘరానా మోసం వెలుగులోకి వచ్చింది. మ్యాట్రిమోనియల్ సైట్ ద్వారా పరిచయమైన రాఘవేంద్ర కిషోర్ అవస్థి (36) అనే వ్యక్తి.. తన భార్య చనిపోయిందని అబద్ధం చెప్పి బాధితురాలి నమ్మకాన్ని చూరగొన్నాడు. త్వరలోనే వివాహం చేసుకుంటానని నమ్మబలికి ఆమెను పలుమార్లు లైంగికంగా దుర్వినియోగం చేశాడు. అనంతరం తాను కొత్తగా జిమ్ వ్యాపారం ప్రారంభించాల్సి ఉందంటూ పెట్టుబడి పేరుతో బాధితురాలి నుంచి విడతల వారీగా రూ.14.8 లక్షలు వసూలు చేశాడు. ఆ తర్వాత డబ్బులు తిరిగి ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతుండటంతో పాటు, అతడి భార్య ఇంకా బతికే ఉందని తెలియడంతో బాధితురాలు షాక్‌కు గురైంది. నిందితుడు తనను మానసికంగా వేధించాడని, శారీరకంగానూ దాడికి పాల్పడ్డాడని ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు నాగపూర్ పోలీసులు నిందితుడు రాఘవేంద్ర కిషోర్‌పై సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ వంచనలో నిందితుడికి అతడి కుటుంబ సభ్యులు కూడా సహకరించినట్లు ఆరోపణలు రావడంతో, పోలీసులు వారి పాత్రపై కూడా విచారణ జరుపుతున్నారు. నిందితుడి బ్యాంక్ ఖాతాలు, ఆర్థిక లావాదేవీలను నిశితంగా పరిశీలిస్తున్నామని పోలీస్ అధికారులు వెల్లడించారు.

# బ్రహ్మోస్‌కు పెరుగుతున్న డిమాండ్

- వియత్నాంతో కీలక ఒప్పందం
- ఇండోనేషియాతో తుది చర్చలు
- రక్షణ ఎగుమతుల్లో ముందడుగు




సింగపూర్, మే 31: భారత రక్షణ రంగానికి మరో కీలక విజయం దక్కింది. ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణిగా గుర్తింపు పొందిన బ్రహ్మోస్‌ను వియత్నాంకు విక్రయించేందుకు భారత్ ఒప్పందం కుదుర్చుకుంది. ఇదే తరహా ఒప్పందం ఇండోనేషియాతో కూడా తుది దశకు చేరుకున్నట్లు భారత రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ వెల్లడించారు. సింగపూర్‌లో నిర్వహించిన షాంగ్రీ-లా భద్రతా సదస్సులో ఆయన ఈ విషయాన్ని ప్రకటించారు. వియత్నాంతో బ్రహ్మోస్ ఒప్పందంపై ఇప్పటికే సంతకాలు పూర్తయ్యాయని రాజేష్ కుమార్ సింగ్ తెలిపారు. అధికారిక ప్రకటన వెలువడకపోయినా ఒప్పంద ప్రక్రియ పూర్తయిందని చెప్పారు. ఈ ఒప్పందం విలువ సుమారు రూ.5,800 కోట్లుగా ఉన్నట్లు సమాచారం. ఇందులో భాగంగా తీరప్రాంత రక్షణ క్షిపణి వ్యవస్థలు, తొలి విడత క్షిపణులు, శిక్షణ కార్యక్రమాలు, సాంకేతిక సహకారం కూడా అందించనున్నారు. ఇండోనేషియాతో చర్చలు కూడా వేగంగా సాగుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య మిగిలిన అంశాలపై సంప్రదింపులు ముగింపు దశలో ఉన్నాయని, త్వరలోనే ఒప్పందం ఖరారయ్యే అవకాశం ఉందని తెలిపారు. దీంతో ఆగ్నేయాసియా ప్రాంతంలో భారత రక్షణ ఉత్పత్తులకు మరింత మార్కెట్ లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే 2022లో ఫిలిప్పీన్స్ బ్రహ్మోస్ క్షిపణుల కొనుగోలుకు భారీ ఒప్పందం కుదుర్చుకుంది. దాంతో భారతదేశం నుంచి బ్రహ్మోస్ కొనుగోలు చేసిన తొలి విదేశంగా ఫిలిప్పీన్స్ నిలిచింది. ఇప్పుడు వియత్నాం కూడా ఆ జాబితాలో చేరగా, ఇండోనేషియా త్వరలో చేరే అవకాశాలు ఉన్నాయి. చైనాతో సముద్ర సరిహద్దు వివాదాలు ఎదుర్కొంటున్న దేశాలు తమ రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేసుకునేందుకు బ్రహ్మోస్‌పై ఆసక్తి చూపుతున్నాయి. ధ్వని వేగం కన్నా మూడు రెట్లు అధిక వేగంతో ప్రయాణించే బ్రహ్మోస్ క్షిపణిని భూమి, గాలి, సముద్రం నుంచి ప్రయోగించే సామర్థ్యం ఉంది. శత్రు యుద్ధనౌకలు, కీలక సైనిక స్థావరాలను అత్యంత కచ్చితత్వంతో లక్ష్యంగా చేసుకుని దాడి చేయగలదు. దీని వేగం, ఆధునిక సాంకేతికత కారణంగా ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు ఆసక్తి కనబరుస్తున్నాయి. రక్షణ ఉత్పత్తుల ఎగుమతులను 2030 నాటికి రూ.50,000 కోట్లకు పెంచాలనే లక్ష్యంతో భారత్ ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలో బ్రహ్మోస్ ఒప్పందాలు భారత రక్షణ పరిశ్రమకు కొత్త అవకాశాలు తెరుస్తున్నాయి. మలేషియా, థాయ్‌లాండ్ వంటి ఇతర ఆగ్నేయాసియా దేశాలు కూడా బ్రహ్మోస్ కొనుగోలుపై ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. దీంతో అంతర్జాతీయ రక్షణ మార్కెట్‌లో భారత స్థానం మరింత బలపడే అవకాశం కనిపిస్తోంది.

# సీడీఎస్‌గా రాజా సుబ్రమణి

## జాతీయ భద్రతే ప్రాధాన్యం

## సైనిక సంస్కరణలకు వేగం

## ఉమ్మడి సమన్వయంపై దృష్టి





**న్యూఢిల్లీ, మే 31 :** భారత ప్రధాన రక్షణ దళాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన జనరల్ ఎన్.ఎస్. రాజా సుబ్రమణి దేశ సార్వభౌమాధికార పరిరక్షణ, జాతీయ భద్రత బలోపేతంపై రక్షణ దళాల అచంచల నిబద్ధతను పునరుద్ఘాటించారు. దేశ భద్రతకు సంబంధించిన అన్ని అంశాల్లో రక్షణ దళాలు మరింత సమర్థవంతంగా పనిచేస్తాయని ఆయన స్పష్టం చేశారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం మాట్లాడిన జనరల్ రాజా సుబ్రమణి, సైనిక వ్యవస్థలో మార్పులను వేగవంతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనేందుకు రక్షణ దళాలను మరింత ఆధునికంగా తీర్చిదిద్దడం అవసరమని పేర్కొన్నారు. భూ, నౌకా, వాయుసేనల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడం తన ప్రధాన లక్ష్యాల్లో ఒకటిగా ఉంటుందని ఆయన వెల్లడించారు. ఉమ్మడి కార్యాచరణ సామర్థ్యాలను పెంచడం ద్వారా దేశ రక్షణ వ్యవస్థ మరింత పటిష్ఠమవుతుందని అభిప్రాయపడ్డారు. సైనిక దళాల కార్యాచరణలో అత్యున్నత ప్రమాణాలను కొనసాగించేందుకు కట్టుబడి ఉన్నామని జనరల్ రాజా సుబ్రమణి తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, ఆయుధ సామర్థ్యాల పెంపు, శిక్షణ వ్యవస్థల బలోపేతం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెప్పారు. సైనికులు, నావికులు, వాయుసేన సిబ్బంది సంక్షేమంతో పాటు మాజీ సైనికుల సంక్షేమంపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపుతామని ఆయన పేర్కొన్నారు. దేశ రక్షణ కోసం సేవలందించిన ప్రతి ఒక్కరి సంక్షేమం ప్రభుత్వానికి, రక్షణ దళాలకు అత్యంత ముఖ్యమని తెలిపారు. వీరనారుల సంక్షేమం కోసం కొనసాగుతున్న కార్యక్రమాలను మరింత విస్తరించనున్నట్లు కూడా జనరల్ రాజా సుబ్రమణి స్పష్టం చేశారు. దేశ భద్రత, సైనిక సామర్థ్యాల పెంపు, సిబ్బంది సంక్షేమం అనే మూడు ప్రధాన లక్ష్యాలతో రక్షణ దళాలు ముందుకు సాగనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# పెట్రోలియం ఎగుమతులపై విండ్‌ఫాల్ పన్ను తగ్గింపు

## ఆయిల్ కంపెనీలకు ఊరట..

## జూన్ 1 నుంచి కొత్త రేట్లు అమలు




**న్యూఢిల్లీ, మే 31 :** పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతిదారులకు ఊరటనిస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులపై విధిస్తున్న విండ్‌ఫాల్ గైన్స్ పన్నును తగ్గిస్తూ ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదివారం నోటిఫికేషన్ జారీ చేసింది. తాజా నిర్ణయం ప్రకారం పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులపై ప్రత్యేక అదనపు ఎక్సైజ్ డ్యూటీని లీటరుకు రూ.1.50 మేర తగ్గించారు. డీజిల్ ఎగుమతులపై పన్నును లీటరుకు రూ.13.50గా నిర్ణయించగా, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్) ఎగుమతులపై లీటరుకు రూ.9.50 పన్ను విధించనున్నారు. ఈ సవరించిన రేట్లు జూన్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి. అయితే దేశీయ మార్కెట్‌లో విక్రయించే పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీలో ఎలాంటి మార్పులు లేవని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ సవరణలు కేవలం ఎగుమతులకే పరిమితమని పేర్కొంది. ఇక మరో కీలక నిర్ణయంగా పెట్రోల్, డీజిల్ ఎగుమతులపై విధిస్తున్న రోడ్డు మరియు మౌలిక సదుపాయాల సెస్‌ను పూర్తిగా సున్నాకు తగ్గించింది. దీంతో ఎగుమతిదారులపై పన్ను భారం కొంత మేర తగ్గనుంది.

### విండ్‌ఫాల్ పన్ను ఎందుకు?

అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు భారీగా పెరిగిన సందర్భాల్లో ఆయిల్ కంపెనీలు అసాధారణ లాభాలు పొందకుండా నియంత్రించేందుకు, అలాగే దేశీయ మార్కెట్‌లో ఇంధన లభ్యతను నిర్ధారించేందుకు కేంద్రం విండ్‌ఫాల్ పన్నును అమలు చేస్తోంది. అంతర్జాతీయ చమురు ధరల పరిస్థితులకు అనుగుణంగా ఈ పన్ను రేట్లను ప్రభుత్వం తరచూ సమీక్షిస్తూ వస్తోంది. ప్రస్తుతం గ్లోబల్ చమురు మార్కెట్లు కొంత స్థిరత్వం దిశగా పయనిస్తున్న నేపథ్యంలో ఎగుమతులపై పన్ను భారం తగ్గించేందుకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆర్థిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# విహార యాత్రలో విషాదం

## లోయలో పడిన ట్యాక్సీ

## ఎనిమిది ప్రాణాలు బలి

## గాలింపులో సహాయక బృందాలు

**చంబా, మే 31 :** హిమాచల్‌ప్రదేశ్‌లోని చంబా జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుని ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. పర్యాటకులతో వెళ్తున్న ఓ టూరిస్టు ట్యాక్సీ అదుపుతప్పి లోతైన లోయలో పడిపోవడంతో ఈ విషాదం సంభవించింది. మృతుల్లో డ్రైవర్‌తో పాటు ఇద్దరు చిన్నారులు కూడా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. బెంగళూరు, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన రెండు కుటుంబాల సభ్యులు ఈ ప్రమాదంలో మృతి చెందినట్లు గుర్తించారు. బైరాగఢ్--సచ్ పాస్ మార్గంలోని కాలాబన్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. వేసవి సెలవులను గడిపేందుకు డల్హౌసీ ప్రాంతానికి వచ్చిన రెండు కుటుంబాలు మంచు పర్వతాలను సందర్శించేందుకు ట్యాక్సీలో బయలుదేరాయి. అయితే ప్రయాణం ముగిసిన తర్వాత కూడా వారు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, ట్యాక్సీ యజమాని ఆందోళనకు గురయ్యారు. వాహనంలో అమర్చిన జీపీఎస్ వ్యవస్థను పరిశీలించిన ట్యాక్సీ యజమాని కాలాబన్ ప్రాంతంలో వాహనం కదలకుండా ఉన్నట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటన స్థలానికి చేరుకున్న అధికారులు పరిశీలించగా ట్యాక్సీ లోతైన లోయలో పడిపోయినట్లు తేలింది. ప్రమాదం జరిగిన ప్రాంతం అత్యంత దుర్భరమైన కొండ ప్రాంతంగా ఉండటంతో సహాయక చర్యలు కష్టతరంగా మారాయి. మొబైల్ నెట్‌వర్క్ అందుబాటులో లేకపోవడం వల్ల సమాచార మార్పిడి, గాలింపు కార్యక్రమాల్లో ఆటంకాలు ఎదురవుతున్నట్లు అధికారులు తెలిపారు. అయినప్పటికీ స్థానికుల సహకారంతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనపై హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వింందర్ సింగ్ సుఖు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎనిమిది



మంది ప్రయాణికులతో వెళ్తున్న వాహనం లోయలో పడిపోవడం అత్యంత విషాదకరమని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలను కూడా రంగంలోకి దించామని, పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రస్తుతం సహాయక బృందాలు ఘటనాస్థలంలో మృతదేహాల కోసం ముమ్మరంగా గాలింపు కొనసాగిస్తున్నాయి. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు.

# విస్తరిస్తున్న స్క్రబ్ టైఫస్..

## ఎలా గుర్తించాలి, చికిత్స ఏమిటి, ఏం జాగ్రత్తలు పాటించాలి?

కరోనా సమయంలో ప్రజలు ఎంత విలవిలలాడిపోయారో అందరికీ తెలిసిందే. చాలా మంది ప్రాణాలను కోల్పోయారు. ఈ క్రమంలో అప్పటి నుంచి కొత్తగా ఏదైనా వ్యాధి వ్యాప్తి చెందుతుందంటే ప్రజలు తీవ్ర భయభ్రాంతులకు గురై బెంబేలెత్తిపోతున్నారు. కొత్త వ్యాధులపై చాలా మందిలోనూ తీవ్రమైన భయాందోళనలు నెలకొంటున్నాయి. ఈ క్రమంలోనే ప్రస్తుతం స్క్రబ్ టైఫస్(%ూఛీతీబఎ ుఎజూష్ట్రబం%) అనే మరో వ్యాధి వ్యాప్తి చెందుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అయితే ఈ వ్యాధి గురించి ఆందోళన చెందాల్సిన పనిలేదని, సరైన సమయంలో అప్రమత్తంగా ఉండి చికిత్స తీసుకుంటే సరిపోతుందని, దీని వల్ల భయభ్రాంతులకు గురి కావల్సిన పనిలేదని వైద్యులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే అసలు ఈ వ్యాధి ఎలా వ్యాప్తి చెందుతుంది, దీని లక్షణాలు ఎలా ఉంటాయి, ఎలాంటి చికిత్స అందిస్తారు, ఏమేం జాగ్రత్తలను పాటించాలి.. అన్న సమస్త విషయాలను వైద్యులు వెల్లడిస్తున్నారు.

**బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్ వల్ల వచ్చే వ్యాధి..**

స్క్రబ్ టైఫస్ అనేది ఓ తీవ్రమైన ఇన్‌ఫెక్షన్ వ్యాధి. పలు రకాలు పురుగులు కుట్టడం వల్ల ఈ వ్యాధి వస్తుంది. %ూతీఅవత్‌ఝ్ ఒబ్‌–ఒబస్త్రుఎబంస్త్రఱ% అనే బ్యాక్టీరియా ఈ వ్యాధిని కలగజేస్తుంది. ఆసియా, ఆస్ట్రేలియా, పసిఫిక్ దీవులు తదితర ప్రాంతాల్లో నివసించే వారికి ఈ వ్యాధి ఎక్కువగా వస్తుంది. అయితే ఈ వ్యాధి కొత్తగా వచ్చిందేమీ కాదు, ఎప్పటి నుంచో ఉన్నదే. కానీ ప్రస్తుతం పలు చోట్ల ప్రజలకు ఇది వ్యాప్తి చెందుతోంది. కొన్ని చోట్ల కొందరు బాధితులు మరణించినట్లు కూడా వార్తలు వస్తున్నాయి. కనుకనే ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అయితే ఈ వ్యాధి కరోనాలాగా ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందదు. కేవలం పురుగులు కుట్టడం వల్లనే వస్తుంది. ఇక ఈ వ్యాధి వచ్చిన వారిలో పలు లక్షణాలు కనిపిస్తాయి.

**లక్షణాలు..**

స్క్రబ్ టైఫస్ వచ్చిన వారికి మొదటి వారం రోజుల వరకు



దాదాపుగా ఎలాంటి లక్షణాలు కనిపించవు. కానీ వారం రోజుల తరువాత నుంచి శరీరంలో పలు లక్షణాలను గమనించవచ్చు. ముఖ్యంగా తీవ్రమైన జ్వరం వస్తుంది. వణుకు కూడా ఉంటుంది. తీవ్రమైన తలనొప్పి, కండరాల నొప్పులు ఉంటాయి. పురుగులు కుట్టిన చోట చర్మంపై పెద్ద ఎత్తున దద్దుర్లు వస్తాయి. ఆ ప్రాంతం అంతా నలుపు లేదా ఎరుపు రంగులోకి మారి దురద పెడుతుంది.

చర్మంపై ఇతర భాగాల్లోనూ కొందరికి దద్దుర్లు వచ్చి దురద పెడుతుంటాయి. తీవ్రమైన దగ్గు ఉంటుంది. వికారం, వాంతికి వచ్చినట్లు ఉండడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షణాలు కనిపిస్తే మాత్రం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే డాక్టర్‌ను కలిసి పరీక్షలు చేయించుకుని చికిత్స తీసుకోవాలి. సాధారణంగా యాంటీ బయోటిక్స్, జ్వరం, ఇన్‌ఫెక్షన్ వంటి సమస్యలకు చెందిన మందులను డాక్టర్లు ఇస్తారు. అందువల్ల ఈ వ్యాధి వచ్చిన వారు దాదాపుగా హాస్పిటల్‌లో చేరకుండానే చికిత్స తీసుకోవచ్చు. కానీ కొందరికి హాస్పిటల్‌లో చికిత్స ఇవ్వాల్సిన అవసరం ఏర్పడుతుంది.

**పాటించాల్సిన జాగ్రత్తలు..**

స్క్రబ్ టైఫస్ వ్యాధి ప్రాణాంతకం కాదు అని, సాధారణ యాంటీ బయోటిక్స్, జ్వరం మందులను ఇస్తే తగ్గిపోతుందని, అందువల్ల దీని గురించి ఆందోళన చెందాల్సిన పనిలేదని వైద్యులు చెబుతున్నారు. అయితే లక్షణాలను నిర్లక్ష్యం చేస్తే మాత్రం ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. ఇక ఈ వ్యాధి సోకిన వారు ద్రవాహారం అధికంగా తీసుకోవాలి. కొబ్బరినీళ్లు, వెజిటబుల్ సూప్, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణాలను తీసుకోవాలి. అలాగే తేలిగ్గా జీర్ణం అయ్యే ఆహారాలను తినాలి. తెల్ల అన్నం, మజ్జిగ అన్నం, కిచిడీ, ఓట్ మీల్, ఉడకబెట్టిన ఆలుగడ్డలు, పెరుగు, పెసలు, అరటి పండ్లు, బొప్పాయి, క్యారెట్లు, గుమ్మడికాయలు వంటి ఆహారాలను తీసుకుంటే శరీరానికి పోషకాలు లభించి వ్యాధి నుంచి త్వరగా కోలుకుంటారు. అలాగే రోగ నిరోధక శక్తి సైతం పెరుగుతుంది. ఇక ఈ వ్యాధి రాకుండా ఉండాలంటే మీ ఇల్లు, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. మురుగు నీరు లేకుండా, ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. ముఖ్యంగా ఇళ్లలో పురుగులు లేకుండా చూసుకోవాలి. ఇంట్లో ఫ్లోర్‌ను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలి. ఈ విధమైన జాగ్రత్తలను పాటిస్తే ఈ వ్యాధి బారిన పడకుండా ఉంటారు.

# పగుళ్లతో పరేషాన్!



శీతాకాలంలో వీచే చలిగాలులకు దగ్గు, జలుబు, జ్వరంతోపాటు పిల్లల్లో పెదాలు పొడిబారడం, పెద్దల్లో పాదాలకు పగుళ్లు రావడం లాంటి సమస్యలు తరచుగా కనిపిస్తాయి. కాలి మడమల్లో పగుళ్లు సాధారణమే అయినా నివారణ చర్యలు తీసుకోకపోతే సమస్య తీవ్రమవుతుంది. సహజంగానే పాదాల చర్మంలో నూనె గ్రంథులు తకువగా ఉంటాయి. శీతాకాలంలో ఈ నూనెలు మరింత తగ్గడంతో మడమల దగ్గర పగుళ్లు ఏర్పడతాయి. వయసు పెరిగే కొద్దీ చర్మం దాని స్థితిస్థాపకతను కోల్పోతుంది. సహజ నూనెల ఉత్పత్తి సైతం తగ్గుతుంది. దీనివల్ల పెద్దవాళ్లలో ఈ సమస్య తీవ్రంగా ఉంటుంది.

మరోవైపు వాతావరణం చల్లగా ఉండటం, తగినంత నీరు తాగకపోవడం మూలంగా శరీరంలో తేమ లోపించి మడమల పగుళ్లకు దారి తీస్తుంది. మడమలు పగిలిన భాగంలో చర్మం పొకులు పొకులుగా లేచి రాత్రి పూట పడుకున్నప్పుడు బెడ్ షీట్ తగిలినా నొప్పిలేస్తుంది. మట్టిలో తిరిగే వారికి బాధ మరింత ఎక్కువగా ఉంటుంది. ఈ పగుళ్ల సమస్యతో మహిళలే ఎకువగా ఇబ్బంది పడుతుంటారు. వీటి నుంచి మీ పాదాలు రక్షించుకోవడానికి రోజూ పాదాలను గోరువెచ్చటి నీటితో శుభ్రం చేసుకోవాలి. వాతావరణంతో సంబంధం లేకుండా సరిపడా నీళ్లు తాగాలి. దీనివల్ల చర్మం పొడిబారకుండా ఉంటుంది. రోజుకు రెండుసార్లు పాదాలకు మాయిశ్చరైజర్ రాసుకోవాలి. వృద్ధులు, మధుమేహ బాధితులు రాత్రిపూట సాక్స్‌లు ధరించడం వల్ల చలిగాలి నుంచి తప్పించుకోవచ్చు. వేడి నీటితో కాకుండా గోరు వెచ్చని నీటితో స్నానం చేయడం ఉత్తమం. ఆహారంలో ఒమేగా ఫ్యాటీ ఆమ్లాలు ఉండే విత్తనాలు, గింజలు, విటమిన్ సి కలిగిన పండ్లు తీసుకుంటూ తగిన జాగ్రత్తలు పాటిస్తూ ఉంటే పగుళ్లు మాయం అవుతాయి.

# చాట్‌బాటతో.. ముప్పు!



ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రాక సంచలనం. వినియోగం ప్రభంజనం. సృష్టించిన ఉద్యోగుల పాలిట శాపం. అంతేకాదు వినియోగదారులకూ ఓ రోగమని ఇప్పుడిప్పుడే గుర్తిస్తున్నారు. ఏఐ ప్రభావం వల్ల మానసిక సమస్యలు వస్తున్నాయని సైకాలజిస్టులు హెచ్చరిస్తున్నారు. ఏఐ సాంకేతిక వినియోగం అన్ని రంగాల్లోకీ విస్తరించింది. ఇందులో సంభాషణ కోసం ఉపయోగించే చాట్‌బాట్‌ల వినియోగం మనుషుల ఆలోచన, ప్రవర్తనపై తీవ్రమైన ప్రభావం చూపుతున్నదని గుర్తించారు.

సోషల్ మీడియా కంటెంట్‌కి భిన్నంగా ఆ వ్యక్తి అవసరం, ఆసక్తికి అనుగుణంగా సమాచారాన్ని సేకరించి ఇచ్చే చాట్‌బాట్‌లతో సంభాషణల్లో వక్రీకరణ, అర్ధ సత్యాలే ఉంటాయని ఇంతవరకూ గుర్తించారు. చాట్‌బాట్‌లు మనిషికి ఒక తోడులా సలహాలూ కూడా ఇస్తున్నాయి. ఈ డిజిటల్ సాహచర్యం మానసిక ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపుతున్నది.

కొంతమంది మానసికవ్యాధులకు ఏఐ చాట్‌బాట్‌ల వినియోగం కారణమవుతుందని కొన్ని అధ్యయనాలు గుర్తించాయి. ఈ చాట్‌బాట్‌లు చెప్పే ముచ్చట్లూ ఆత్మహత్యల్ని ప్రేరేపిస్తున్నాయని మానసిక నిపుణులు చెబుతున్నారు. చాట్‌బాట్‌లు చెప్పే విషయాలు వినియోగదారులను ఏ మేరకు ప్రభావితం చేస్తున్నాయి, ఎంతమందిపై ఏ స్థాయిలో వీటి ప్రభావం ఉందో తెలుసుకునేందుకు ఇప్పటి వరకు కచ్చితమైన అధ్యయనాలు జరగలేదు. అందువల్ల ఏఐ చాట్‌బాట్‌ల ముచ్చట్లతో కాస్త జాగ్రత్తగా ఉండాలని సైకాలజిస్టులు హెచ్చరిస్తున్నారు.

# రోజూ ఈ ఆహారాలను తినండి..

## మీ జుట్టు వేగంగా పెరుగుతుంది.. జుట్టు అసలు రాలదు..



ప్రస్తుతం చాలా మంది అనేక రకాల జుట్టు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. వాటిల్లో జుట్టు రాలడం కూడా ఒకటి. జుట్టు రాలిపోయేందుకు అనేక కారణాలు ఉంటున్నాయి. థైరాయిడ్, ఒత్తిడి, ఆందోళన, కాలుష్యం, దీర్ఘకాలిక వ్యాధులు ఉండడం, మందులను అధికంగా వాడడం వంటి వాటితోపాటు పోషకాహార లోపం వల్ల కూడా ఈ సమస్య వస్తుందని వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం చాలా మంది సరైన ఆహారాలను తినడం లేదు. బయటి ఫుడ్‌ను ఎక్కువగా తింటున్నారు. దీని కారణంగా చాలా మందిలో పోషకాహార లోపం సమస్య తలెత్తుతోంది. ఇది జుట్టు రాలేందుకు కారణం అవుతోంది. అయితే రోజూ మనం తినే ఆహారాల విషయంలో పలు మార్పులు చేసుకుంటే జుట్టు రాలే సమస్యను చాలా సులభంగా తగ్గించుకోవచ్చు. మనం తినే ఆహారాలే మన జుట్టు పెరుగుదలను ప్రభావితం చేస్తాయి. కనుక పోషకాలు ఉండే ఆహారాలను తినాల్సి ఉంటుంది.

**ఆకుకూరలు..**

జుట్టు రాలిపోయేందుకు ప్రధాన కారణం మన శరీరంలో తగినంత మోతాదులో మినరల్స్ లేకపోవడమే అని చెప్పవచ్చు. ముఖ్యంగా ఫోలేట్, ఐరన్‌తోపాటు విటమిన్లు ఎ, సి తక్కువగా ఉండడం లేదా లోపం వల్ల జుట్టు రాలిపోతుంది. కనుక ఈ పోషకాలు మనకు లభించేలా చూసుకోవాలి. ఇందుకు గాను రోజూ పాలకూర జ్యూస్‌ను తాగాలి. పాలకూరలో అధికంగా పోషకాలు ఉంటాయి. ఇందులో ఉండే విటమిన్లు ఎ, సి, క్యాల్షియం, ఐరన్, యాంటీ ఆక్సిడెంట్లు జుట్టు పెరుగుదలకు దోహదం చేస్తాయి. కనుక రోజూ పాలకూర జ్యూస్‌ను తాగుతుంటే ఫలితం ఉంటుంది. అలాగే రోజూ దాల్చిన చెక్కను ఆహారంలో భాగం చేసుకుంటే జుట్టు పెరుగుదలకు ఎంతో దోహదం చేస్తుంది. దాల్చిన చెక్క పొడిని మీరు తినే ఆహారాలపై చల్లి తినవచ్చు. లేదా ఈ చెక్కను నీటిలో వేసి మరిగించి తాగవచ్చు. దీని వల్ల కేవలం జుట్టు పెరగడమే కాకుండా షుగర్, కొలెస్ట్రాల్ లెవల్స్ అదుపులో ఉంటాయి.

**గింజలు, విత్తనాలు..**

ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉండే గింజలు, విత్తనాలను రోజూ తింటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. ముఖ్యంగా బాదంపప్పు, పిస్తా, వాల్ నట్స్, జీడిపప్పు, గుమ్మడి విత్తనాలు, పొద్దు తిరుగుడు విత్తనాలు, అవిసె గింజలు, చియా సీడ్స్‌ను ఆహారంలో భాగం చేసుకోవాలి. వీటిల్లో ఉండే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు జుట్టు పెరుగుదలకు దోహదం చేస్తాయి. అలాగే గుండెను కూడా ఆరోగ్యంగా ఉంచుతాయి. ఈ గింజలు, విత్తనాల్లో విటమిన్ ఇ కూడా అధికంగానే ఉంటుంది. ఇది జుట్టును సంరక్షిస్తుంది. శిరోజాలు పెరిగేలా చేస్తుంది. అలాగే సోయాబీన్ ఉత్పత్తులను తరచూ ఆహారంలో భాగం చేసుకోవాలి. సోయా టోఫు, సోయా పాలు, సోయా గింజలను తీసుకోవాలి. వీటిల్లో ఉండే క్యాల్షియం, ఐరన్, ఇతర పోషకాలు జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తాయి. జుట్టు ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి.

**కోడిగుడ్లు, చేపలు..**

రోజూ ఒక కోడిగుడ్డును ఆహారంలో భాగం చేసుకుంటే శరీరానికి బయోటిన్ అధికంగా లభిస్తుంది. ఇది జుట్టు ఒత్తుగా పెరిగి దృఢంగా, ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. కోడిగుడ్లలో ప్రోటీన్లు, జింక్, సెలీనియం అధిక మొత్తంలో ఉంటాయి. ఇవి కూడా శిరోజాలను సంరక్షిస్తాయి. అలాగే వారంలో కనీసం 2 సార్లు చేపలను తింటున్నా ఉపయోగం ఉంటుంది. వీటిల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు, ఇతర ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్లు, విటమిన్ డి ఉంటాయి. ఇవన్నీ జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తాయి. ఇలా ఆయా ఆహారాలను రోజూ తీసుకుంటే జుట్టు రాలడాన్ని తగ్గించుకోవచ్చు. శిరోజాలు ఒత్తుగా పెరిగి దృఢంగా ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే అన్ని పోషకాలు లభించి ఆరోగ్యంగా ఉంటారు. ఇతర అనారోగ్య సమస్యలు రాకుండా అడ్డుకోవచ్చు.



# బంగారం స్థిరం

## వెండి ధరల్లోనూ మార్పుల్లేవు

**హైదరాబాద్, మే 31 :** అంతర్జాతీయ ఆర్థిక, భౌగోళిక రాజకీయ పరిణామాల మధ్య బంగారం, వెండి ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఈక్విటీ మార్కెట్లు, కరెన్సీ మార్కెట్లు హెచ్చుతగ్గులకు లోనవుతున్నప్పటికీ, పెట్టుబడిదారులు సురక్షిత పెట్టుబడిగా భావించే బంగారంపై డిమాండ్ తగ్గడం లేదు. దీంతో దేశీయ మార్కెట్‌లో పసిడి ధరలు ఉన్నత స్థాయిలో కొనసాగుతున్నాయి. మార్కెట్ వర్గాల అంచనాల ప్రకారం, అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ద్రవ్యోల్బణ భయాలు, కేంద్ర బ్యాంకుల బంగారం కొనుగోళ్లు పసిడి ధరలకు మద్దతుగా నిలుస్తున్నాయి. దీంతో బంగారం ధరల్లో పెద్దగా మార్పులు కనిపించకపోయినా, రికార్డు స్థాయిలకు సమీపంలోనే కొనసాగుతున్నాయి. గుడ్ రిటర్న్ గణాంకాల ప్రకారం ఆదివారం ఉదయం నాటికి హైదరాబాద్, విజయవాడ నగరాల్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,57,040గా నమోదైంది. అదే సమయంలో 22 క్యారెట్ల 10 గ్రాముల ఆభరణాల బంగారం ధర రూ. 1,43,950గా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో బంగారం ధరలు స్వల్పంగా ఎక్కువగా ఉన్నాయి. అక్కడ 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ. 1,57,190కు చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,44,100గా కొనసాగుతోంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు, వివిధ దేశాల మధ్య కొనసాగుతున్న రాజకీయ ఉద్రిక్తతలు, అంతర్జాతీయ మార్కెట్లలో పెరుగుతున్న అస్థిరత కారణంగా బంగారం ధరలు సమీప భవిష్యత్తులో కూడా బలంగానే కొనసాగే అవకాశం ఉంది. మరోవైపు వెండి ధరలు కూడా ప్రస్తుతం స్థిరంగానే ఉన్నాయి. పరిశ్రమల వినియోగం, పెట్టుబడి డిమాండ్ రెండింటి ప్రభావంతో వెండి ధరలు ఉన్నత స్థాయిలో కొనసాగుతున్నాయి. హైదరాబాద్, విజయవాడ నగరాల్లో ప్రస్తుతం కిలో వెండి ధర రూ. 2,90,000గా ఉంది. చెన్నైలో కూడా కిలో వెండి ధర ఇదే స్థాయిలో రూ. 2,90,000గా కొనసాగుతోంది. అదే సమయంలో ఢిల్లీ, బెంగళూరు నగరాల్లో కిలో వెండి ధర రూ. 2,80,000గా నమోదైంది. వివిధ ప్రాంతాల్లో స్థానిక పన్నులు, రవాణా వ్యయాలు, డిమాండ్ ఆధారంగా ధరల్లో స్వల్ప తేడాలు కనిపిస్తున్నాయి. బంగారం, వెండి ధరలు ప్రస్తుతం అత్యున్నత స్థాయిల్లో కొనసాగుతున్న నేపథ్యంలో ఆభరణాల కొనుగోలు చేయాలనుకునే వినియోగదారులు మార్కెట్ పరిస్థితులను గమనించి నిర్ణయం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. పెట్టుబడి పరంగా చూస్తే, దీర్ఘకాలికంగా బంగారం ఇప్పటికీ సురక్షిత ఆస్తిగానే పరిగణించబడుతోందని ఆర్థిక విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తున్నారా?

### ఒక్క తప్పుతో బ్యాంక్ ఖాతా ఖాళీ కావచ్చు..!

**హైదరాబాద్, మే 31 :** డిజిటల్ చెల్లింపులు వేగంగా పెరుగుతున్న ఈ రోజుల్లో క్యూఆర్ కోడ్‌ల వినియోగం సాధారణమైపోయింది. కిరాణా దుకాణాల నుంచి షాపింగ్ మాల్స్ వరకు, పార్కింగ్ ఫీజుల నుంచి రెస్టారెంట్ బిల్లుల వరకు ప్రతిచోటా క్యూఆర్ కోడ్‌ల ద్వారానే చెల్లింపులు జరుగుతున్నాయి. అయితే ఇదే సౌలభ్యాన్ని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సైబర్ భద్రతా సంస్థల సమాచారం ప్రకారం, నకిలీ క్యూఆర్ కోడ్‌ల ద్వారా వినియోగదారుల బ్యాంకు ఖాతా వివరాలు, యూపీఐ పిన్‌లు, పాస్‌వర్డ్‌లు, వ్యక్తిగత సమాచారాన్ని దోచుకునే ఘటనలు పెరుగుతున్నాయి. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసిన వెంటనే అందులో కనిపించే లింక్‌ను పరిశీలించకుండా ఓపెన్ చేయడం వల్ల చాలామంది మోసపోతున్నారు. ఈ తరహా మోసాన్ని "క్విషింగ్" అని పిలుస్తున్నారు. అసలైన క్యూఆర్ కోడ్‌లా కనిపించే నకిలీ కోడ్‌లను ఏర్పాటు చేసి, వినియోగదారులను మోసపూరిత వెబ్‌సైట్లకు మళ్లిస్తారు. అక్కడ బ్యాంకింగ్ సమాచారం, కార్డు వివరాలు, యూపీఐ పిన్ వంటి వివరాలు నమోదు చేయమని కోరుతారు. బాధితులు ఆ వివరాలు నమోదు చేసిన వెంటనే వారి ఖాతాలు ప్రమాదంలో పడే అవకాశం ఉంటుంది. నిపుణుల సూచనల ప్రకారం, క్యూఆర్ కోడ్ స్కాన్ చేసిన తర్వాత తెరపై కనిపించే వెబ్‌సైట్ చిరునామాను జాగ్రత్తగా పరిశీలించాలి. బ్రాండ్ పేర్లలో చిన్న మార్పులు, అనవసర అక్షరాలు లేదా అనుమానాస్పద డొమైన్‌లు కనిపిస్తే వెంటనే ఆ ప్రక్రియను నిలిపివేయాలి. అలాగే సాధారణ చెల్లింపుల కోసం ఓటీపీ, పూర్తి బ్యాంకు వివరాలు లేదా యాప్ డౌన్‌లోడ్ అవసరం ఉండదని నిపుణులు చెబుతున్నారు. అలాంటి అభ్యర్థనలు వస్తే అది మోసపూరిత చర్యగా భావించి అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ఇమెయిల్స్, ఎస్ఎంఎస్‌లు లేదా సోషల్ మీడియా ద్వారా వచ్చిన "బహుమతి గెలిచారు", "ప్రత్యేక డిస్కౌంట్", "ఖాతా వెరిఫికేషన్" వంటి సందేశాల్లోని క్యూఆర్ కోడ్‌ల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.




# చికెన్ ధరలు సామాన్యులకు ఊరట

### తెలుగు రాష్ట్రాల్లో స్థిరంగా మార్కెట్

**హైదరాబాద్, మే 31 :** తెలుగు రాష్ట్రాల్లో చికెన్ ధరలు ప్రస్తుతం సామాన్య ప్రజలకు అందుబాటులోనే కొనసాగుతున్నాయి. గత కొద్ది నెలలుగా పౌల్ట్రీ రంగంలో నెలకొన్న స్థిరత్వం, మార్కెట్‌లో సరఫరా మెరుగుపడటం, వినియోగదారుల డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి పెరగడం వంటి కారణాలతో చికెన్ ధరలు నియంత్రణలో ఉన్నాయి. దీంతో మాంసాహార ప్రియులకు ప్రస్తుతం కొంత ఊరట లభిస్తోంది. రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో ధరలను పరిశీలిస్తే హైదరాబాద్‌లో స్కిన్‌లెస్ చికెన్ కిలో ధర రూ. 250 నుంచి రూ. 280 మధ్య కొనసాగుతోంది. నగరంలోని వివిధ ప్రాంతాల్లో డిమాండ్‌ను బట్టి ధరల్లో స్వల్ప మార్పులు కనిపిస్తున్నప్పటికీ, మొత్తం మీద మార్కెట్ స్థిరంగానే ఉంది. వారాంతాల్లో కొంత డిమాండ్ పెరిగినా ధరల్లో పెద్దగా పెరుగుదల నమోదు కావడం లేదు. వరంగల్, ఖమ్మం వంటి పట్టణాల్లో చికెన్ కిలో ధర సుమారు రూ. 250 వద్ద కొనసాగుతోంది. ఈ ప్రాంతాల్లో స్థానిక పౌల్ట్రీ ఫామ్‌ల నుంచి సరఫరా సమృద్ధిగా ఉండటంతో ధరలు అదుపులో ఉన్నాయి. వినియోగదారుల కొనుగోలు శక్తిని దృష్టిలో పెట్టుకుని వ్యాపారులు కూడా అధిక ధరలకు విక్రయించకుండా జాగ్రత్త పడుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాలో అత్యల్ప ధరలు నమోదవుతున్నాయి. అక్కడ కిలో చికెన్ ధర సుమారు రూ. 220గా ఉండటం గమనార్హం. స్థానికంగా ఉత్పత్తి అధికంగా ఉండటం, సరఫరా సులభంగా అందుబాటులో ఉండటం ఇందుకు ప్రధాన కారణంగా చెబుతున్నారు. విశాఖపట్నంలో చికెన్ ధర కిలోకు రూ. 250 వద్ద స్థిరంగా ఉంది. నగరంలో డిమాండ్ ఎక్కువగా ఉన్నప్పటికీ సరఫరా కూడా తగిన స్థాయిలో ఉండటంతో ధరలు అదుపులోనే కొనసాగుతున్నాయి. రాజమండ్రి, చిత్తూరు వంటి ప్రాంతాల్లో మాత్రం కిలో చికెన్ ధర రూ. 280 వరకు పలుకుతోంది. రవాణా ఖర్చులు, స్థానిక డిమాండ్, వ్యాపార పరిస్థితులను బట్టి అక్కడ ధరలు కొంత ఎక్కువగా ఉన్నాయి. మరోవైపు గుడ్ల ధరలు కూడా స్థిరంగా కొనసాగుతున్నాయి. హైదరాబాద్ మార్కెట్‌లో ఒక్క గుడ్డు ధర సుమారు రూ. 6గా నమోదవుతోంది. పౌల్ట్రీ రంగంలో ఉత్పత్తి సాధారణ స్థాయిలో కొనసాగుతుండటంతో గుడ్ల ధరల్లో కూడా పెద్ద మార్పులు కనిపించడం లేదు. పౌల్ట్రీ రంగ నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈ ఏడాది వేసవి తీవ్రత కొంత తగ్గడం, ఫామ్‌లలో మెరుగైన నిర్వహణ పద్ధతులు అమలు చేయడం, కోళ్ల మరణాల శాతం తగ్గడం వంటి అంశాలు ఉత్పత్తి స్థిరత్వానికి దోహదపడ్డాయి. గతంలో వాతావరణ మార్పులు, వ్యాధుల ప్రభావంతో సరఫరాలో అంతరాయాలు ఏర్పడి ధరలు పెరిగేవి. ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేకపోవడంతో మార్కెట్ ప్రశాంతంగా కొనసాగుతోంది. వ్యాపార వర్గాల అంచనాల ప్రకారం రాబోయే కొన్ని వారాలపాటు కూడా చికెన్ ధరల్లో పెద్దగా మార్పులు ఉండకపోవచ్చు. పండుగలు లేదా ప్రత్యేక సందర్భాల్లో డిమాండ్ పెరిగితే స్వల్ప పెరుగుదల కనిపించే అవకాశం ఉన్నప్పటికీ, ప్రస్తుతం సరఫరా బలంగా ఉండటంతో వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెబుతున్నారు. చికెన్, గుడ్ల ధరలు అందుబాటులో ఉండటంతో కుటుంబాల ఆహార వ్యయంపై అదనపు భారం పడకుండా ఉండటమే కాకుండా, పౌల్ట్రీ రంగానికి కూడా స్థిరమైన ఆదాయం లభించే పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు, వ్యాపారులు, వినియోగదారులు ముగ్గురికీ ప్రస్తుత మార్కెట్ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.




# టయోటా నుంచి సరికొత్త విద్యుత్ కారు




**న్యూఢిల్లీ, మే 31 :** దేశీయ విద్యుత్ వాహనాల విభాగంలో పోటీ రోజురోజుకూ పెరుగుతున్న వేళ ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ టయోటా మరో సరికొత్త విద్యుత్ కారును భారత మార్కెట్లోకి తీసుకొచ్చింది. 'ఎబెల్లా' పేరుతో విడుదల చేసిన ఈ ఆధునిక విద్యుత్ వాహనం ఆకర్షణీయమైన రూపకల్పన, అధునాతన సాంకేతికత, మెరుగైన భద్రతా ప్రమాణాలతో వినియోగదారులను ఆకట్టుకునేలా రూపొందించబడింది. ఈ కొత్త కారు ప్రారంభ ధరను రూ. 23.60 లక్షలుగా కంపెనీ నిర్ణయించింది. వివిధ అవసరాలకు అనుగుణంగా మూడు వేరియంట్లలో ఈ వాహనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. విద్యుత్ వాహనాలను కొనుగోలు చేయాలనుకునే వినియోగదారులకు ఇది మరో ఆకర్షణీయమైన ఎంపికగా మారనుందని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. టయోటా ఎబెల్లాలో రెండు రకాల బ్యాటరీ ఎంపికలను అందిస్తోంది. 61 కిలోవాట్ గంటల సామర్థ్యం గల బ్యాటరీతో కూడిన మోడల్ ఒకసారి పూర్తిగా ఛార్జ్ చేస్తే గరిష్ఠంగా 541 కిలోమీటర్ల వరకు ప్రయాణించగలదని కంపెనీ తెలిపింది. దీర్ఘదూర ప్రయాణాలు చేసే వినియోగదారులకు ఈ మోడల్ మరింత అనుకూలంగా ఉండనుంది. అదే విధంగా 49 కిలోవాట్ గంటల బ్యాటరీతో రూపొందించిన మరో మోడల్ ఒక్కసారి ఛార్జింగ్‌తో 344 కిలోమీటర్ల వరకు ప్రయాణించే సామర్థ్యాన్ని కలిగి ఉంది. పట్టణ ప్రాంతాల్లో రోజువారీ వినియోగానికి ఈ మోడల్ అనువైనదిగా కంపెనీ పేర్కొంది. వాహన అంతర్గత సౌకర్యాల విషయంలో కూడా టయోటా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. 10.1 అంగుళాల ఇన్ఫోటైన్‌మెంట్ వ్యవస్థతో పాటు 10.25 అంగుళాల డిజిటల్ డ్రైవర్ డిస్‌ప్లేను అందించింది. డ్రైవింగ్ అనుభవాన్ని మరింత సౌకర్యవంతంగా మార్చేందుకు ముందు భాగంలో వెంటిలేటెడ్ సీట్లు ఏర్పాటు చేశారు. అంతేకాకుండా స్థిర గాజు పైకప్పు, వైర్‌లెస్ మొబైల్ ఫోన్ ఛార్జింగ్ సదుపాయం, వైర్‌లెస్ యాపిల్ కార్ కనెక్టివిటీ, ఆండ్రాయిడ్ ఫోన్ అనుసంధాన వ్యవస్థ, గాలి శుద్ధి యంత్రం, స్వయంచాలక శీతలీకరణ వ్యవస్థ వంటి ఆధునిక సౌకర్యాలను ఈ కారులో పొందుపరిచారు. భద్రతా అంశాలకు కూడా కంపెనీ అత్యంత ప్రాధాన్యం ఇచ్చింది. ప్రయాణికుల రక్షణ కోసం ఏడు గాలితిత్తులు, నాలుగు చక్రాలకు డిస్క్ బ్రేకింగ్ వ్యవస్థ, ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్, ఆధునిక నియంత్రణ వ్యవస్థలు వంటి పలు భద్రతా ఫీచర్లను అందించింది. భారతదేశంలో విద్యుత్ వాహనాల వినియోగం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో టయోటా ఎబెల్లా విడుదల ప్రాధాన్యత సంతరించుకుంది. అధిక ప్రయాణ దూరం, ఆధునిక సాంకేతిక సదుపాయాలు, మెరుగైన భద్రతా ప్రమాణాలు కలగలిపిన ఈ వాహనం దేశీయ విద్యుత్ వాహనాల విభాగంలో కీలక పోటీదారుగా నిలిచే అవకాశాలు ఉన్నాయని ఆటోమొబైల్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# పండుగ సీజన్‌లో స్మార్ట్‌ఫోన్ విక్రయాలకు భారీ దెబ్బ!

**న్యూఢిల్లీ, మే 31 :** దేశవ్యాప్తంగా స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌కు ధరల పెంపు ప్రభావం తీవ్రంగా తాకే సూచనలు కనిపిస్తున్నాయి. రూపాయి విలువ క్షీణించడం, దిగుమతి వ్యయాలు పెరగడం వల్ల మొబైల్ తయారీ సంస్థలు వరుసగా ధరలను పెంచుతున్న నేపథ్యంలో వినియోగదారులు కొత్త ఫోన్ల కొనుగోలుపై వెనక్కి తగ్గుతున్నట్లు తాజా నివేదిక వెల్లడించింది. ఈ పరిస్థితి కొనసాగితే రాబోయే పండుగల సీజన్‌లో స్మార్ట్‌ఫోన్ అమ్మకాలు దాదాపు 30శాతం వరకు పడిపోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ట్రైకిన్ టెక్నాలజీ, టెకేర్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనంలో ఈ అంశాలు వెలుగులోకి వచ్చాయి. దేశవ్యాప్తంగా సుమారు ఆరు వేల మంది చురుకైన మొబైల్ కొనుగోలుదారుల అభిప్రాయాలను సేకరించి రూపొందించిన ఈ నివేదికలో వినియోగదారుల కొనుగోలు ధోరణిలో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటున్నట్లు వెల్లడైంది. సర్వేలో పాల్గొన్న వారిలో దాదాపు 48 శాతం మంది వచ్చే ఆరు నెలల్లో కొత్త స్మార్ట్‌ఫోన్ కొనుగోలును వాయిదా వేసే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. పెరుగుతున్న ధరల కారణంగా ప్రస్తుతం ఉపయోగిస్తున్న ఫోన్‌ను మరికొంతకాలం కొనసాగించాలనే నిర్ణయానికి చాలామంది వచ్చారని నివేదిక పేర్కొంది. మరోవైపు కేవలం ఆరు శాతం మంది మాత్రమే తమ పాత ఫోన్‌ను మార్పిడి చేసి కొత్త స్మార్ట్‌ఫోన్ కొనుగోలు చేసే అవకాశం ఉందని వెల్లడించారు. ప్రస్తుతం రూ. 20 వేల లోపు ధర కలిగిన స్మార్ట్‌ఫోన్ల ధరలు సగటున 8 శాతం నుంచి 12 శాతం వరకు పెరిగినట్లు అధ్యయనంలో తేలింది. ఈ ధరల పెరుగుదల మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి వినియోగదారులపై ప్రత్యక్ష ప్రభావం చూపుతోందని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా పండుగల సమయంలో భారీగా కొనుగోళ్లు జరిగే విభాగాల్లో డిమాండ్ తగ్గే అవకాశం ఉందని వారు చెబుతున్నారు. గత ఏడాది కాలంలో అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ సుమారు ఐదు శాతం మేర క్షీణించింది. దీని ప్రభావం మొబైల్ ఫోన్ తయారీ ఖర్చులపై పడడంతో కంపెనీలు ధరల పెంపు దిశగా అడుగులు వేయాల్సి వచ్చిందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే ఈ నిర్ణయం అమ్మకాలపై ప్రతికూల ప్రభావం చూపుతోందని టెకేర్ వ్యవస్థాపకుడు ఫైజల్ కవూసా అభిప్రాయపడ్డారు. నివేదిక ప్రకారం ధరల పెరుగుదల ఇదే స్థాయిలో కొనసాగితే దేశంలో స్మార్ట్‌ఫోన్ డిమాండ్ గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. వచ్చే ఆరు నెలల్లో మొత్తం స్మార్ట్‌ఫోన్ విక్రయాలు 11 నుంచి 12 కోట్ల యూనిట్ల మధ్యకు పరిమితమయ్యే ప్రమాదం ఉందని అంచనా వేస్తున్నారు. గత సంవత్సరాలతో పోలిస్తే ఇది గణనీయమైన తగ్గుదలగా భావిస్తున్నారు. మరో ఆసక్తికర అంశం ఏమిటంటే, కొత్త ఫోన్ల ధరలు పెరగడంతో కొంతమంది వినియోగదారులు రెండో చేతి మొబైల్ ఫోన్ల వైపు మొగ్గు చూపుతున్నారు. సర్వేలో పాల్గొన్న వారిలో ఆరు శాతం మంది సెకండ్‌హ్యాండ్ స్మార్ట్‌ఫోన్ కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపినట్లు వెల్లడైంది. దీంతో వినియోగించిన ఫోన్ల మార్కెట్‌కు కూడా కొత్త ఊపు వచ్చే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. మొత్తంగా చూస్తే, స్మార్ట్‌ఫోన్ ధరల పెరుగుదల కేవలం వినియోగదారుల ఖర్చులపైనే కాకుండా మొత్తం మొబైల్ పరిశ్రమ వృద్ధి రేటుపైనా ప్రభావం చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి. పండుగల సీజన్‌కు ముందు ధరలు స్థిరపడకపోతే మార్కెట్ మరింత మందగించే పరిస్థితి ఏర్పడవచ్చని పరిశ్రమ వర్గాలు హెచ్చరిస్తున్నాయి.





# ఒకే ఓవర్‌లో ఆరు సిక్సర్లు

## నేపాల్ యువ సంచలనం చరిత్ర

**సింగపూర్, మే 31 :** అంతర్జాతీయ క్రికెట్‌లో ఒకే ఓవర్‌లో ఆరు సిక్సర్లు బాదిన అరుదైన ఆటగాళ్ల జాబితాలో నేపాల్ యువ ఓపెనర్ కుశాల్ భుర్టెల్ చోటు సంపాదించాడు. ఆసియా క్రీడల పురుషుల టీ20 క్వాలిఫయర్ టోర్నీలో చైనాతో జరిగిన మ్యాచ్‌లో అతడు ఈ అద్భుత ఘనత సాధించి ప్రపంచ క్రికెట్ దృష్టిని ఆకర్షించాడు. ఇన్నింగ్స్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన భుర్టెల్ చైనా బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ముఖ్యంగా ఇన్నింగ్స్ తొమ్మిదో ఓవర్‌లో చుయూయ్ చెన్ వేసిన ఆరు బంతులను వరుసగా బౌండరీల అవతలికి తరలించి అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. కేవలం 43 బంతుల్లోనే 129 పరుగులు చేసి ప్రత్యర్థి బౌలింగ్ దాడిని పూర్తిగా చిత్తు చేశాడు. భుర్టెల్ విధ్వంసకర ఇన్నింగ్స్‌లో ఏకంగా 16 భారీ సిక్సర్లు నమోదయ్యాయి. అనంతరం డెంగ్ జింకీ బౌలింగ్‌లో అవుటైనా అప్పటికే మ్యాచ్ నేపాల్ ఆధీనంలోకి వెళ్లిపోయింది. అతడి తుఫాన్ ఇన్నింగ్స్ సాయంతో నేపాల్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 313 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. 314 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన చైనా జట్టు ఆరంభం నుంచే ఒత్తిడిలో పడింది. నేపాల్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో చైనా బ్యాటర్లు పెద్దగా ప్రతిఘటించలేకపోయారు. ఫలితంగా ఆ జట్టు కేవలం 92 పరుగులకే ఆలౌట్ అయి భారీ పరాజయాన్ని చవిచూసింది. క్రికెట్ చరిత్రలో ఒకే ఓవర్‌లో ఆరు సిక్సర్లు బాదిన ఆటగాళ్ల జాబితాలో ఇప్పటికే హెర్షెల్ గిబ్స్, యువరాజ్ సింగ్, కీరన్ పోలార్డ్, జస్కరన్ మల్హోత్రా, దీపేంద్ర సింగ్ ఎయిరీ వంటి దిగ్గజాలు ఉన్నారు. ఇప్పుడు ఆ జాబితాలో కుశాల్ భుర్టెల్ కూడా చేరి తన పేరును సువర్ణాక్షరాలతో లిఖించుకున్నాడు. సింగపూర్ వేదికగా జరుగుతున్న ఈ టోర్నీలో మొత్తం ఎనిమిది జట్లు రెండు గ్రూపులుగా పోటీపడుతున్నాయి. నేపాల్, చైనా, ఖతార్, మలేసియా గ్రూప్-ఎలో ఉండగా, బహ్రెయిన్, హాంకాంగ్, ఒమన్, సింగపూర్ జట్లు గ్రూప్-బిలో తలపడుతున్నాయి. ఈ భారీ విజయంతో నేపాల్ జట్టు టైటిల్ ఫేవరెట్‌గా నిలుస్తుండగా, భుర్టెల్ పేరు ప్రస్తుతం అంతర్జాతీయ క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.



# ఇషాన్ కిషన్‌కు షాక్

## జార్ఖండ్ లీగ్ వేలంలో రాబిన్ మింజ్ టాప్!

**రాంచీ, మే 31:** టీమిండియా యువ వికెట్‌కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్‌కు జార్ఖండ్ టీ20 లీగ్ వేలంలో ఊహించని షాక్ తగిలింది. భారత జట్టు తరఫున, ఐపీఎల్‌లో తన దూకుడైన ఆటతో గుర్తింపు తెచ్చుకున్న ఇషాన్ కిషన్‌ను వెనక్కి నెట్టి, యువ ఆటగాడు రాబిన్ మింజ్ ఈ టోర్నీ చరిత్రలోనే అత్యధిక ధర పలికిన క్రికెటర్‌గా నిలిచాడు. జార్ఖండ్ రాష్ట్ర క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో రాంచీలో నిర్వహించిన తొలి జార్ఖండ్ టీ20 లీగ్ మెగా వేలం ఆసక్తికరంగా సాగగా, ఆటగాళ్ల కొనుగోలులో ఫ్రాంచైజీలు తీవ్ర పోటీ పడ్డాయి. ఈ లీగ్‌లో రాంచీ టైటాన్స్, జంషెడ్‌పూర్ స్టీలర్స్, చోటానాగ్‌పూర్ రాయల్స్, కోయలాంచల్ సూపర్ కింగ్స్, ధన్‌బాద్ డైమండ్స్, సంథాల్ స్ట్రయికర్స్ జట్లు పాల్గొన్నాయి. ప్రతి ఫ్రాంచైజీకి రూ.50 లక్షల బడ్జెట్ కేటాయించగా, యువ ఆటగాళ్ల కోసం గట్టి పోటీ కనిపించింది. ముఖ్యంగా రాబిన్ మింజ్‌ను సొంతం చేసుకునేందుకు పలు జట్లు పోటీ పడగా, చివరకు కోయలాంచల్ సూపర్ కింగ్స్ రూ.15.25 లక్షలతో అతడిని దక్కించుకుంది. దీంతో ఈ లీగ్ చరిత్రలో అత్యధిక ధర పలికిన ఆటగాడిగా రాబిన్ మింజ్ కొత్త రికార్డు నెలకొల్పాడు. మరోవైపు, అంతర్జాతీయ అనుభవం కలిగిన ఇషాన్ కిషన్‌ను సంథాల్ స్ట్రయికర్స్ రూ.14.70 లక్షలకు కొనుగోలు చేసింది. రాబిన్ మింజ్ కంటే ఇషాన్ ధర రూ.55 వేల తక్కువగా ఉండటం క్రికెట్ అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. ఐపీఎల్‌లో పరుగుల వర్షం కురిపించిన ఇషాన్ కిషన్ కంటే రాబిన్ మింజ్‌కు ఎక్కువ ధర రావడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. క్రికెట్ వర్గాల విశ్లేషణ ప్రకారం, రాబిన్ మింజ్‌కు ఉన్న పవర్ హిట్టర్ ఇమేజ్ అతని విలువను పెంచింది. తక్కువ బంతుల్లో మ్యాచ్ ఫలితాన్ని మార్చగల సామర్థ్యం అతడికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టింది. అలాగే ఇషాన్ కిషన్ జాతీయ జట్టు బాధ్యతల కారణంగా టోర్నీలోని కొన్ని మ్యాచ్‌లకు అందుబాటులో లేకపోవచ్చనే అంచనాలు కూడా వేలంలో అతడి ధరపై ప్రభావం చూపినట్లు తెలుస్తోంది. జూన్ 10 నుంచి ప్రారంభం కానున్న జార్ఖండ్ టీ20 లీగ్‌లో మొత్తం 27 మ్యాచ్‌లు జరగనున్నాయి. రాష్ట్ర స్థాయి ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ టోర్నీపై ఇప్పటికే అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. రాబిన్ మింజ్, ఇషాన్ కిషన్ వంటి స్టార్ ఆటగాళ్ల ప్రదర్శనలపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది. ఈ లీగ్ ద్వారా భవిష్యత్ భారత క్రికెటర్లుగా ఎదిగే యువ ప్రతిభావంతులు వెలుగులోకి వస్తారని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



# ఐపీఎల్ చాంపియన్ ఆర్సీబీ!





**ఫైనల్లో జీటీపై ఐదు వికెట్ల తేడాతో ఘన విజయం**

**చెలరేగిన కింగ్ కోహ్లీ..**

**అజేయ అర్ధ శతకంతో అదుర్స్**

**పద్దెనిమిది ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించిన బెంగళూరు**

**బౌలింగ్ లో అదరగొట్టిన రసిఖ్ సలామ్, భువీ**

**అహ్మదాబాద్, మే 31 (మనసులో మాట):** ఐపీఎల్ ట్రోఫీ కోసం సుదీర్ఘ కాలంగా ఎదురుచూస్తున్న ఆర్సీబీ అభిమానుల కల ఎట్టకేలకు సాకారమైంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్ పోరులో గుజరాత్ టైటాన్స్ పై (జీటీ) ఐదు వికెట్ల తేడాతో ఆర్సీబీ ఘన విజయం సాధించింది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అజేయ అర్ధ శతకంతో చెలరేగడంతో.. 156 పరుగుల లక్ష్యాన్ని ఆర్సీబీ కేవలం పద్దెనిమిది ఓవర్లలోనే ఐదు వికెట్లు కోల్పోయి ఛేదించింది. సమిష్టి కృషితో అదరగొట్టిన బెంగళూరు జట్టు సగర్వంగా ఐపీఎల్ చాంపియన్ గా అవతరించి చరిత్ర సృష్టించింది.

## తడబడిన గుజరాత్ బ్యాటింగ్..

ఈ మెగా ఫైనల్లో టాస్ గెలిచిన ఆర్సీబీ ముందుగా బౌలింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్ కు దిగిన గుజరాత్ టైటాన్స్ నిర్ణీత ఇరవై ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి 155 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఆర్సీబీ బౌలర్ల కచ్చితమైన బంతుల ధాటికి గుజరాత్ బ్యాటర్లు క్రీజులో నిలవలేకపోయారు. వాషింగ్టన్ సుందర్ ఒక్కడే 37 బంతుల్లో అజేయంగా 50 పరుగులు చేసి జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించాడు. నిశాంత్ సింధు 18 బంతుల్లో 20 పరుగులు, జోస్ బట్లర్ 23 బంతుల్లో 19 పరుగులు చేసి పెవిలియన్ చేరారు. బెంగళూరు బౌలర్లలో రసిఖ్ సలామ్ నాలుగు ఓవర్లలో కేవలం 27 పరుగులిచ్చి మూడు కీలక వికెట్లు పడగొట్టాడు. భువనేశ్వర్ కుమార్ రెండు వికెట్లు, జోష్ హేజిల్ వుడ్ రెండు వికెట్లు తీసి గుజరాత్ బ్యాటింగ్ లైనప్ ను దెబ్బతీశారు.

## కోహ్లీ మాస్టర్ క్లాస్.. అయ్యర్ మెరుపులు..

అనంతరం 156 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆర్సీబీకి ఆరంభంలోనే ఇబ్బందులు ఎదురైనా.. విరాట్ కోహ్లీ అద్భుత ఇన్నింగ్స్ తో జట్టును ఆదుకున్నాడు. 42 బంతులు ఎదుర్కొన్న కోహ్లీ 75 పరుగులతో నాటౌట్ గా నిలిచి ఒంటిచేత్తో మ్యాచ్ ను విజయతీరాలకు చేర్చాడు. అతనికి తోడుగా వెంకటేష్ అయ్యర్ కేవలం 16 బంతుల్లోనే 32 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. చివర్లో టిమ్ డేవిడ్ 17 బంతుల్లో 24 పరుగులు జోడించడంతో ఆర్సీబీ విజయం ఖాయమైంది. గుజరాత్ బౌలర్లలో రషీద్ ఖాన్ రెండు వికెట్లు పడగొట్టగా.. అర్షద్ ఖాన్, మహ్మద్ సిరాజ్ తలా ఒక వికెట్ తీశారు. కోహ్లీ అద్భుత ఆటతీరుతో ఇంకా 12 బంతులు మిగిలి ఉండగానే ఆర్సీబీ విన్నింగ్ షాట్ కొట్టి దర్జాగా కప్పును ముద్దాడింది.





మనసులో మాట
KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక




# భార్యల బాధలకు దేవేంద్రుడి పరిష్కారం!

**హైదరాబాద్, మే 31 :** ఓటీటీ ప్రేక్షకులను నవ్వులతో ముంచెత్తిన ప్రముఖ హాస్య ధారావాహిక 'సేవ్ ది టైగర్స్'ఇప్పుడు మూడో సీజన్‌తో మరోసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే రెండు భాగాలతో విశేష ఆదరణ పొందిన ఈ సిరీస్, ఈసారి మరింత వినోదం, కొత్త కథా మలుపులు, ఊహించని ఫాంటసీ అంశాలతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. జూన్ 19 నుంచి ప్రముఖ డిజిటల్ వేదికలో ప్రసారం కానున్న ఈ సిరీస్‌కు సంబంధించిన ప్రచార చిత్రాన్ని తాజాగా విడుదల చేయగా, అది సామాజిక మాధ్యమాల్లో మంచి స్పందనను సొంతం చేసుకుంటోంది. ప్రచార చిత్రం ప్రారంభం నుంచే వినోదభరితంగా సాగుతుంది. పెళ్లి తర్వాత తమ జీవితాలు ఎలా మారిపోయాయో ముగ్గురు స్నేహితులు సరదాగా చెప్పుకునే సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. కుటుంబ జీవితంలో ఎదురయ్యే చిన్న చిన్న సంఘటనలను హాస్యంతో మేళవిస్తూ కథను ముందుకు తీసుకెళ్లిన విధానం ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. గత రెండు సీజన్లలో మాదిరిగానే ఈసారి కూడా భార్యాభర్తల మధ్య జరిగే సరదా సంఘటనలు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. అయితే ఈ సీజన్‌లో ప్రత్యేకత ఏమిటంటే ఫాంటసీ అంశాల కలయిక. ఒక సందర్భంలో స్వర్గలోకంలోని దేవేంద్రుడి పాత్రలో ప్రముఖ హాస్య నటుడు వెన్నెల కిషోర్ కనిపించడం కథకు కొత్త మలుపును తీసుకువచ్చింది. అతని ప్రవేశం తర్వాత ముగ్గురు స్నేహితుల జీవితాలు పూర్తిగా మారిపోతాయి. సాధారణ జీవితాన్ని గడుపుతున్న వారు ఒక్కసారిగా సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకోవడం కథలో ప్రధాన ఆసక్తికర అంశంగా మారింది. ఒకరు ప్రజాప్రతినిధిగా ఎదగగా, మరొకరు ప్రముఖ రచయితగా గుర్తింపు పొందుతారు. ఇంకొకరు భారీ సంస్థకు ప్రధాన కార్యనిర్వాహక అధికారిగా బాధ్యతలు చేపడతారు. ఈ మార్పులు నిజంగానే జరిగాయా? లేక దైవకృపతో వచ్చిన అద్భుత పరిణామాలా? అన్న ప్రశ్నలకు సమాధానంగా కథ సాగనున్నట్లు ప్రచార చిత్రం ద్వారా తెలుస్తోంది. హాస్యంతో పాటు భావోద్వేగాలు, కుటుంబ బంధాలు, సామాజిక వ్యంగ్యం కూడా ఈసారి కథలో చోటు చేసుకున్నాయి. ప్రధాన పాత్రల్లో నటించిన ప్రియదర్శి, అభినవ్ గోమటం, చైతన్య కృష్ణ మరోసారి తమ సహజ నటనతో ఆకట్టుకున్నారు. వీరి భార్యల పాత్రల్లో నటించిన పావని గంగిరెడ్డి, జోర్దార్ సుజాత, దేవియాని శర్మలు కూడా కథకు బలంగా నిలిచారు. గత సీజన్లలో వీరి పాత్రలకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభించగా, ఈసారి మరింత బలమైన పాత్రలతో కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఈ ధారావాహికను ప్రముఖ దర్శకుడు మహి వి. రాఘవ్, ప్రదీప్ అద్వైతం రూపొందించగా, శ్రీరామ్ ఎరగం దర్శకత్వ బాధ్యతలు నిర్వహించారు. కుటుంబ ప్రేక్షకులను, యు-వతను ఒకేసారి ఆకట్టుకునేలా కథను మలిచిన విధానం ప్రత్యేకంగా కనిపిస్తోంది. ప్రచార చిత్రం విడుదలైన తర్వాత ప్రేక్షకుల్లో అంచనాలు మరింత పెరిగాయి. గత రెండు సీజన్లు డిజిటల్ వేదికలో సంచలన విజయాలు నమోదు చేసిన నేపథ్యంలో, మూడో సీజన్ కూడా అదే స్థాయిలో ఆదరణ పొందుతుందనే నమ్మకంతో నిర్మాతలు ఉన్నారు. హాస్యం, కుటుంబ అనుబంధాలు, ఫాంటసీ అంశాల సమ్మేళనంగా రూపొందిన ఈ సిరీస్ మరోసారి ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించేందుకు సిద్ధమవుతోంది. జూన్ 19 నుంచి ప్రారంభమయ్యే ఈ కొత్త ప్రయాణం ఓటీటీ ప్రపంచంలో మరో విజయగాథగా నిలుస్తుందా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది.

# బన్నీ పొలిటికల్ ఎంట్రీ?

## అభిమానుల్లో ఆసక్తి రేపుతున్న ప్రచారం




తెలుగు చలనచిత్ర పరిశ్రమకు రాజకీయాలతో ఉన్న అనుబంధం కొత్తది కాదు. గతంలో అనేక మంది సినీ ప్రముఖులు ప్రజాదరణను రాజకీయ విజయంగా మలుచుకుని ప్రజా జీవితంలో తమదైన ముద్ర వేశారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రిగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ బాధ్యతలు చేపట్టడం, తమిళ సినీ నటుడు విజయ్ సొంత రాజకీయ పార్టీ స్థాపించి రాజకీయాల్లో చురుకుగా వ్యవహరించడం వంటి పరిణామాల నేపథ్యంలో మరో టాలీవుడ్ స్టార్ హీరో రాజకీయ ప్రవేశంపై ఆసక్తికర చర్చ మొదలైంది. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ రాజకీయాల్లోకి అడుగుపెట్టనున్నారనే ప్రచారం ప్రస్తుతం సామాజిక మాధ్యమాలు, సినీ వర్గాల్లో విస్తృతంగా చర్చనీయాంశమవుతోంది. అల్లు అర్జున్‌కు దేశవ్యాప్తంగా ఉన్న అభిమాన వర్గం, ముఖ్యంగా 'పుష్ప' సినిమాతో సాధించిన అంతర్జాతీయ గుర్తింపు కారణంగా ఆయన భవిష్యత్తు రాజకీయ ప్రస్థానంపై ఊహాగానాలు మరింత వేగం పుంజుకున్నాయి. సినీ రంగంలోనే కాకుండా యువతలో, సామాజిక మాధ్యమాల్లో ఆయనకు ఉన్న అపారమైన ఆదరణను దృష్టిలో ఉంచుకుని రాజకీయ రంగప్రవేశం చేసే అవకాశాలపై అనేక కథనాలు వెలువడుతున్నాయి. సినీ, రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, తమిళనాడులో విజయ్ అనుసరిస్తున్న వ్యూహాన్ని అధ్యయనం చేస్తూ, దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకు వెళ్లాలనే ఆలోచనలో అల్లు అర్జున్ ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. రాజకీయ వ్యూహకర్తలతో ఇటీవల కొన్ని సమావేశాలు జరిగినట్లు కూడా వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఈ సమావేశాలకు సంబంధించి ఎలాంటి అధికారిక సమాచారం బయటకు రాలేదు. అయినప్పటికీ భవిష్యత్తులో జరిగే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే సామాజిక, ప్రజా సేవా కార్యక్రమాల ద్వారా బలమైన వేదికను నిర్మించుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయనే చర్చ కొనసాగుతోంది. అల్లు అర్జున్‌కు తెలుగు రాష్ట్రాలతో పాటు దక్షిణ భారతదేశం మొత్తం, ఉత్తర భారతదేశంలోని పలు ప్రాంతాల్లో కూడా భారీ అభిమాన గణం ఉంది. 'ఆల్ ఇండియా అల్లు అర్జున్ ఆర్మీ' పేరుతో పనిచేస్తున్న అభిమాన సంఘాలు అనేక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ ఇప్పటికే తమ ప్రత్యేకతను చాటుకుంటున్నాయి. ఒకవేళ భవిష్యత్తులో రాజకీయాల్లోకి రావాలనే నిర్ణయం తీసుకుంటే, ఇదే అభిమాన బలం ఆయనకు పెద్ద రాజకీయ మూలధనంగా మారే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సినీ ప్రముఖుల రాజకీయ ప్రయాణాలను పరిశీలిస్తే, ప్రజాదరణను ఓట్లుగా మార్చుకోవడం అంత సులభమైన విషయం కాదని కూడా రాజకీయ పరిశీలకులు గుర్తుచేస్తున్నారు. ప్రజా సమస్యలపై స్పష్టమైన అవగాహన, దీర్ఘకాలిక రాజకీయ కట్టుబాటు, క్షేత్రస్థాయి కార్యకలాపాలు, బలమైన నాయకత్వ లక్షణాలు వంటి అంశాలు కూడా సమానంగా అవసరమని చెబుతున్నారు. అందువల్ల కేవలం అభిమాన బలం మాత్రమే రాజకీయ విజయానికి సరిపోదని విశ్లేషిస్తున్నారు. ప్రస్తుతం అల్లు అర్జున్ మాత్రం తన సినీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. భారీ స్థాయిలో రూపొందుతున్న పలు చిత్రాల చిత్రీకరణల్లో పాల్గొంటూ ఆయన కెరీర్‌లో అత్యంత కీలక దశను కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ ప్రవేశంపై వస్తున్న వార్తలపై ఆయన నుంచి గానీ, ఆయన బృందం నుంచి గానీ ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. గతంలో కూడా ఇలాంటి వార్తలు వచ్చినప్పుడు వాటిని ఆయన సన్నిహిత వర్గాలు ఖండించిన సందర్భాలు ఉన్నాయి. అయితే అధికారిక ప్రకటనలు లేకుండానే సామాజిక మాధ్యమాల్లో ఈ ప్రచారం విస్తృతంగా చర్చకు దారితీస్తోంది. అభిమానులు ఒకవైపు బన్నీ రాజకీయాల్లోకి వస్తే స్వాగతిస్తామని చెబుతుండగా, మరికొందరు మాత్రం ప్రస్తుతం ఆయన పూర్తి దృష్టి సినిమాలపైనే ఉందని అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా చూస్తే అల్లు అర్జున్ రాజకీయ అరంగేట్రంపై వస్తున్న వార్తలు ప్రస్తుతం ఊహాగానాల స్థాయిలోనే ఉన్నప్పటికీ, అవి సినీ, రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు కారణమవుతున్నాయి. భవిష్యత్తులో ఈ ప్రచారానికి సంబంధించి స్పష్టత రావాలంటే అధికారిక ప్రకటన కోసం వేచి చూడాల్సిందే.

# గ్లామర్‌తో మెరిసే యామిని భాస్కర్..



యామిని భాస్కర్ తాజాగా సోషల్ మీడియాలో మరోసారి హాట్ టాపిక్‌గా మారారు. ఆమె పంచుకున్న స్టైలిష్ ఫొటోలు అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటూ వైరల్ అవుతున్నాయి. ఆధునిక దుస్తుల్లో, ఆకర్షణీయమైన హావభావాలతో కనిపించిన యామిని ఫొటోలకు నెటిజన్ల నుంచి భారీ స్పందన లభిస్తోంది. విజయవాడకు చెందిన యామిని భాస్కర్ మోడలింగ్ రంగం నుంచి సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టారు. 2014లో రభస చిత్రంతో వెండితెరపై కనిపించిన ఆమె, అనంతరం పలు చిత్రాల్లో నటిస్తూ గుర్తింపు సంపాదించారు. 2015లో విడుదలైన కీచక సినిమా ఆమె కెరీర్‌కు కీలక మలుపుగా నిలిచింది. ఆ చిత్రంలో నటనకు విమర్శకుల ప్రశంసలు దక్కాయి. తరువాత కాటమరాయుడు, నర్తశాల, భలే మంచి చౌక బేరం తదితర చిత్రాల్లో నటించి ప్రేక్షకులను మెప్పించారు. సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ చురుకుగా ఉండే యామిని, తరచూ ఫ్యాషన్ ఫొటోషూట్లు, వ్యక్తిగత అప్‌డేట్లను అభిమానులతో పంచుకుంటూ తన ఫాలోయింగ్‌ను పెంచుకుంటున్నారు. సంప్రదాయ, ఆధునిక దుస్తుల్లో సమానంగా మెప్పించే నటీమణుల్లో ఆమె ఒకరిగా నిలుస్తున్నారు. తాజా ఫొటోషూట్‌లో స్టైలిష్ లుక్‌తో కనిపించిన యామిని భాస్కర్ అందం, ఆత్మవిశ్వాసం, కెమెరా ముందు చూపిన హావభావాలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. రాబోయే రోజుల్లో మరిన్ని ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులతో ఆమె ప్రేక్షకులను అలరించే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

# నచ్చిన కథలతోనే ప్రత్యేక గుర్తింపు: యామీ గౌతమ్



బాలీవుడ్‌లో గ్లామర్ కంటే కథ, పాత్రల ఎంపికకు ప్రాధాన్యం ఇచ్చే నటీమణుల్లో యామీ గౌతమ్ ఒకరు. తాను నమ్మని కథలకు ధైర్యంగా 'కాదు' చెప్పడం వల్లే సినీ పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు సంపాదించగలిగానని ఆమె పేర్కొన్నారు. ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో తన సినీ ప్రయాణం గురించి మాట్లాడుతూ, అవకాశాల కోసం ఎప్పుడూ రాజీపడలేదని తెలిపారు. కథపై పూర్తి నమ్మకం ఉన్నప్పుడే సినిమా అంగీకరిస్తానని, ప్రేక్షకులపై ప్రభావం చూపే పాత్రలకే ప్రాధాన్యం ఇస్తానని చెప్పారు. తన కెరీర్‌లో 2018 కీలక మలుపుగా నిలిచిందని యామీ వెల్లడించారు. ఖతీఱ: ఏష్త్రవ ౯ాబతీస్త్రఱఘ్శ్రీ హ్ెతీఱనెవ, ధీఝ్శ్రీఝ చిత్రాల విజయాలు తనకు మరింత ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చాయని పేర్కొన్నారు. ఆ తర్వాత నుంచి సామాజిక సందేశం కలిగిన, ప్రేక్షకులను ఆలోచింపజేసే కథలనే ఎంచుకుంటున్నానని తెలిపారు. "పని లేకపోయినా పర్వాలేదు కానీ, నాకు నమ్మకం లేని కథను కేవలం డబ్బు కోసం చేయను. ప్రతి అవకాశాన్ని అంగీకరించడం కంటే సరైన అవకాశాన్ని ఎంచుకోవడం ముఖ్యం" అని యామీ స్పష్టం చేశారు. మాతృత్వంలోకి అడుగుపెట్టిన తర్వాత కూడా తన ఆలోచనల్లో ఎలాంటి మార్పు రాలేదని ఆమె చెప్పారు. కుటుంబం, వృత్తి రెండింటినీ సమతుల్యం చేసుకుంటూ ముందుకు సాగుతున్నానని, మంచి కథలు వస్తే భవిష్యత్తులో కూడా విభిన్న పాత్రల్లో కనిపిస్తానని తెలిపారు. అవార్డుల కంటే ప్రేక్షకుల ప్రేమే తనకు అత్యంత విలువైనదని యామీ పేర్కొన్నారు. "అవార్డులు కొన్ని క్షణాల ఆనందాన్ని మాత్రమే ఇస్తాయి. కానీ ప్రేక్షకుల ప్రశంసలు జీవితాంతం గుర్తుండిపోతాయి. వారు చూపించే ప్రేమే ఒక నటుడికి నిజమైన గౌరవం" అని అన్నారు. మహిళా ప్రాధాన్యత ఉన్న కథల్లో నటిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించిన యామీ గౌతమ్, వినోదంతో పాటు ఆలోచింపజేసే చిత్రాల్లో నటించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. నాణ్యమైన కథల ఎంపికతో కమర్షియల్ విజయాలతో పాటు విమర్శకుల ప్రశంసలను కూడా సమానంగా అందుకుంటూ కొత్తతరం నటీనటులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

CHIEF EDITOR BY **KANCHARLA ATCHUTA RAO** PUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/A2169. PRINTED BY **CHAITANYAVARADHI** PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 08914540746